విశాఖపట్టణం
సోమవారం 22 జూన్ 2026

For a pure tomorrow..

జయ జయహే

epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక:149 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

## ముంబైలో మళ్లీ
# కరోనా కేసుల కలకలం!

రుతుపవనాల ఆలస్యంతో శ్వాసకోశ ఇన్ఫెక్షన్ల పెరుగుదల

తీవ్ర జ్వరం, దగ్గు లక్షణాలతో ఆసుపత్రులకు పోటెత్తుతున్న రోగులు

యాంటీబయాటిక్స్ వాడొద్దని, జాగ్రత్తలు పాటించాలని వైద్యుల సూచన



2

# హెల్దీ ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా...

## బాబా రామ్‌దేవ్‌తో కలిసి చంద్రబాబు, లోకేశ్ యోగాభ్యాసం

రాష్ట్రవ్యాప్తంగా 1.33 లక్షల కేంద్రాలలో కోటి మంది యోగా సాధన

రాష్ట్రంలో పచ్చదనాన్ని 50 శాతానికి పెంచుతాం

ఆగస్టు 15 నుంచి 'సంజీవని' ప్రాజెక్ట్ అమలు

సాంకేతికత, ఆధ్యాత్మికతల కలయికతోనే సమాజ భవిష్యత్తు

భారత్ శక్తులను ప్రపంచానికి చాటి చెప్పిన మోడీ

విజయవాడ ఇందిరా గాంధీ స్టేడియంలో యోగా వేడుకలు

**ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:**





అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడ ఇందిరా గాంధీ స్టేడియంలో నిర్వహించిన యోగా వేడుకలు అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రముఖ యోగా గురువు బాబా రామ్‌దేవ్‌తో కలిసి సామూహిక యోగాభ్యాసంలో పాల్గొన్నారు. ప్రశాంత వాతావరణంలో బాబా రామ్‌దేవ్‌తో కలిసి యోగా చేయడం ఎన్నటికీ మరువలేని అనుభూతిని ఇచ్చిందని ఈ సందర్భంగా సీఎం హర్షం వ్యక్తం చేశారు. యోగాకు అంతర్జాతీయ స్థాయిలో అపారమైన గుర్తింపు తెచ్చి, నేడు ప్రపంచవ్యాప్తంగా దాదాపు 190 దేశాల్లో ఈ ఉత్సవాలు నిర్వహించేలా చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. మోదీ తన చొరవతో ప్రపంచానికి భారతదేశ శక్తులను చాటుతూ, దేశాన్ని అగ్రభాగాన నిలబెడుతున్నారని ..మిగతా 2లో



## రక్షణ రంగంలో భారత్
# కొనుగోలుదారుగా ఉండబోదు
### ప్రధాని మోదీ

స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన 3 నౌకలు జాతికి అంకితం

కోల్‌కతాలో 3 నౌకలను జాతికి అంకితం చేసిన ప్రధాని మోదీ

**ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:**

సముద్రశక్తి లేకుండా ఏ దేశం కూడా బలమైన శక్తిగా ఎదగలేదని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. అభివృద్ధి, భద్రత, సంపద సముద్రాలతోనే ముడిపడి ఉన్నాయని చెప్పారు. దేశం ఆర్థిక, వ్యూహాత్మక ప్రభావాన్ని నిర్ణయించడంలో బలమైన సముద్రతీర సామర్థ్యాలు కీలకపాత్ర పోషిస్తాయన్నారు. కోల్‌కతాలోని శ్యామప్రసాద్ ముఖర్జీ ఓడరేవులో స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన 3 నౌకలను ప్రధాని మోదీ ప్రారంభించారు. ఐఎన్ఎస్ దునగిరి, ఐఎన్ఎస్ సంశోధక్, ఐఎన్ఎస్ అగ్రయ్ ను నౌకలను కమిషన్ చేశారు. భారత నౌకాదళానికి చెందిన వార్‌షిప్ డిజైన్ బ్యూరోతో పాటు కోల్‌కతాకు చెందిన గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్, ఇంజనీర్స్ సంయుక్తంగా రూపొందించాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాని, దేశ సామర్థ్యాల గుర్తింపు స్వావలంబన ద్వారా తప్ప ప్రపంచానికి మార్కెట్‌గా మారడం ద్వారా రాకూడదన్నారు. కొన్నేళ్ల క్రితం విమాన వాహకనౌక విక్రాంత్‌ను ప్రారంభించడం ద్వారా భారత్ తన సముద్ర సామర్థ్యాలను ప్రపంచానికి చాటిందన్నారు. గత కొన్నేళ్లలో 40కి పైగా యుద్ధనౌకలు, జలాంతర్గాములను వినియోగంలోకి తెచ్చామని ప్రధాని మోదీ తెలిపారు. ఆదివారం ప్రారంభించిన మూడు నౌకల ..మిగతా 2లో



## కరీంనగర్‌లో ఆర్టీసీ ఎలక్ట్రిక్
# బస్సులో మంటలు..

డ్రైవర్ అప్రమత్తతో 41 మంది ప్రాణాలతో బయటపడ్డారు

**ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:**

కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సులో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అయితే, డ్రైవర్ సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో 41 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఈ ఘటనతో పెను ప్రమాదం తప్పినట్లయింది. వివరాల్లోకి వెళితే కరీంనగర్ డిపోకు చెందిన ఎలక్ట్రిక్ బస్సు ఇవాళ ఉదయం 41 మంది ..మిగతా 2లో

# మహానుభావులు...
## వాడకం తెలిసిన నేతలు

టీడీపీ పుట్టె ముంచుతున్న మంత్రులు, నాయకులు

దిగజారుతున్న ఆర్థిక పరిస్థితి... పడిపోతున్న ప్రభుత్వ గ్రాఫ్









**విశాఖపట్నం, జూన్ 20, జయ జయహే**

ఎవరు ఎలాంటివారో తెలియాలంటే వారికి ఒకసారి పదవి ఇస్తే చాలని పెద్దల సూక్తి అచ్చు గుద్దినట్లు ఈ పచ్చ నాయకులకు వర్తిస్తుంది. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో ప్రజలలో అసంతృప్తే తప్ప ఆనందం కనిపించడం లేదు. మేధావి వర్గాలు సైతం పెంచుకుంటూ పోతున్న సంక్షేమ పథకాలు చూసి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ లానే ..మిగతా 2లో



## ఇరాన్‌పై ఇజ్రాయిల్ దాడులతో....
## మళ్ళీ మొదటికొచ్చిన
# సంక్షోభం

ఎట్టకేలకు ప్రారంభమైన ఇరాన్ యూఎస్ చర్చలు

**ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:**

అమెరికా, ఇరాన్‌ల మధ్య యుద్ధం శాశ్వత ముగింపు కోసం స్విట్జర్లాండ్ వేదికగా ఎట్టకేలకు చర్చలు మొదలయ్యాయి. అమెరికా తరఫున ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ఇరాన్ తరఫున పార్లమెంట్ స్పీకర్ ఘాలిబాఫ్ బృందాలు ఇందులో పాల్గొన్నాయి. పాకిస్థాన్, ఖతార్ ప్రతినిధులు మధ్యవర్తిత్వం వహిస్తున్నారు. అదే సమయంలో ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు ..మిగతా 2లో



## రైతులను మోసం చేయడంలో.....
# చంద్రబాబు రికార్డు సృష్టించారు

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మండిపాటు

**ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:**

రైతులను మోసం చేస్తున్న చంద్రబాబుపై వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులపై చంద్రబాబు ప్రేమ బూటకం–మోసం నిజం అంటూ ట్వీట్ చేశారు. "చంద్రబాబూ రైతులను మోసం చేయడంలో మీ రికార్డులను మీరే బద్దలు కొడుతున్నారు. సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ అయినా, మేనిఫెస్టోలో మీరు ఇచ్చిన 143 హామీలు అయినా, అన్నీ మోసాలే" అంటూ ఎక్స్ వేదికగా నిలదీశారు.

"మా ప్రభుత్వం 2019 నుంచి 2024 వరకు ఐదేళ్ల పాటు 53.58 లక్షల రైతు కుటుంబాలకు క్రమం తప్పకుండా రైతు భరోసా అందించింది. ఆర్థిక ఒత్తిళ్లు ఉన్నా, కరోనా ..మిగతా 2లో

## రెండేళ్ల కూటమి పాలనపై
# ప్రోగ్రెస్ రిపోర్ట్‌లు





3

## విజయవాడ యువకుడు సాయికృష్ణ కేసు..
# దర్యాప్తునకు సిట్ ఏర్పాటు

విజయవాడ యువకుడు గాదె సాయికృష్ణ పోలీస్ కస్టడీలో మృతి చెందినట్లు ఆరోపణలు

సిట్ ఏర్పాటు చేసిన పోలీస్ డిపార్ట్ మెంట్

ఐజీ రవి ప్రకాశ్ నేతృత్వంలో దర్యాప్తునకు ప్రభుత్వ ఆదేశం



**ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:**

విజయవాడలో సంచలనం సృష్టించిన యువకుడి కస్టడీ మృతి ఆరోపణల కేసు దర్యాప్తును ప్రభుత్వం వేగవంతం చేసింది. 25 ఏళ్ల గాదె సాయికృష్ణ అదృశ్యం, కస్టడీ మృతి ఆరోపణలపై విచారణ జరిపేందుకు ఏపీ పోలీస్ శాఖ ప్రత్యేక దర్యాప్తు ..మిగతా 2లో

## తమిళనాడులో
# ఘోర ప్రమాదం

అమ్మోనియా వాయువు లీకై ఏడుగురి మృతి

74 మందికి పైగా తీవ్ర అస్వస్థత, పలువురి పరిస్థితి విషమం

యూనిట్‌లో వాల్వ్ ఫెయిల్ కావడం వల్లే ప్రమాదం

ఘటనపై పూర్తిస్థాయి విచారణకు జిల్లా కలెక్టర్ ఆదేశం

**ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:**



తమిళనాడులో ఘోర పారిశ్రామిక ప్రమాదం చోటుచేసుకుంది. తిరువళ్లూరు జిల్లాలోని ఓ ప్రైవేట్ సీఫుడ్ ప్రాసెసింగ్ కంపెనీలో అమోనియా గ్యాస్ లీక్ కావడంతో ఏడుగురు కార్మికులు ప్రాణాలు ..మిగతా 2లో

For a pure tomorrow..
జయహో

# మహానుభావులు.. వాడకం తెలిసిన నేతలు

**మొదటి పేజీ తరువాయి...**

ఈ ముఖ్యమంత్రి కూడా అప్పులు తీసుకువచ్చి ప్రజలపై మరింత భారం పెంచుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. సంపద సృష్టి లేకపోగా ప్రభుత్వ దుబారా విచ్చల విడిగా పెరిగిపోయింది. సైకిళ్లపై అసెంబ్లీకి, సచివాలయాలకు వెడుతూ పొదుపు డ్రామాలకు ప్రభుత్వం తెరతీయడం చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు. రెండేళ్ల పాలనలో ఏం సాధించారని సంబరాలు చేసుకుంటున్నారు ? ఈ సంబరాలకు ఎంత వ్యయం జరుగుతుంది ? ఇదా పొదుపు ? పత్రికా సమావేశాలు పెట్టి రెండేళ్ల లో జరిగిన అభివృద్ధి వివరిస్తే సరిపోతుంది గా ? అవినీతి పెరగడం, జవాబుదారీతనం లోపించడం, ప్రభుత్వ యంత్రాంగం పూర్తిగా గాడి తప్పడం వంటి లోపాలు ప్రభుత్వానికి కనిపించడం లేదా ? పెద్ద పెద్ద కంపెనీలు తీసుకువస్తున్నాం వేలాది మంది యువతకు ఉపాధి కల్పన అని చెబుతూ, ఇంత అభివృద్ధి ఏ రాష్ట్రంలో లేదంటూ ప్రజలను మభ్యపెడుతున్నారు. ఏపీ ఆర్థిక స్థిరత్వం అంత బలంగా లేదని, తెలంగాణ ఇంతకంటే బెటర్ పొజిషన్ లో ఉందని నేషనల్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీ ఇటీవల పేర్కొనడం కూటమి ప్రభుత్వ డొల్లతనాన్ని బయటపెట్టింది. రెవెన్యూ ఆదాయం కంటే హామీలకు చెల్లించే మొత్తం రెట్టింపు లో ఉండడం, దీనివలన బాలెన్స్ షీట్ గతి తప్పే ప్రమాదం ఉందని హెచ్చరికలు జారీ కావడం ప్రస్తుత రాష్ట్ర పరిస్థితి. దుస్థితి ని సూచిస్తుంది. రాష్ట్ర పాలన ఈ విధంగా ఉంటే మరోవైపు తెలుగు దేశం పార్టీ నాయకుల తీరు మరింత ఘోరం గా ఉంది. దీపం ఉంటుండగా ఇల్లు చక్కదిద్దుకోవాలనే ఆతృత వీరిలో అయితే కనిపిస్తుంది. మళ్లీ అధికారంలోకి వస్తామనే ధీమా వీరిలో కనిపించడం లేదు. ఎందుకైనా మంచిదని వైసీపీ నాయకులతో దోస్తీ కొడుతూ వారి పనులు కూడా వీరు చేసి పెడుతున్నారు. వారిని కలుపుకు పోతూ అడ్డగోలుగా దోపిడీకి తెరతీశారు. ప్రతీ గ్రామంలోనూ ఈ అక్రమ స్నేహాలు కనిపిస్తున్నాయి. రెండేళ్ల పాలనలో మైనింగ్ దందాలు, ప్రభుత్వ భూమి ఆక్రమణలు విచ్చలవిడిగా పెరిగిపోయాయి. చర్యలు తీసుకునే అధికార యంత్రాంగం కూడా కూటమి నాయకులకు వత్తాసు పలకడంతో రెండేళ్ల పాలనలో ప్రభుత్వ గ్రాఫ్ పడిపోతూ వస్తుంది. ఎంత దారుణంగా పరిస్థితి తయారైంది అంటే ప్రభుత్వ రికార్డులు టాంపరింగ్ చేసి మరీ దోచుకోవడం విశేషం.

దోచుకో...నీకెంత...నాకెంత అనే విధానం అన్ని ప్రాంతాలకు పాకింది. ఉదాహరణకు అనకాపల్లి నియోజకవర్గంను చూస్తే ఇక్కడ జనసేన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ. కానీ చక్రం తిప్పుతున్నది మాత్రం టీడీపీ నాయకులు. టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జి పీలా గోవింద, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తన అనుచర గణాలు ఎటువంటి మైనింగ్ అనుమతులు లేకుండా కొండలను దర్జాగా కొల్లగొట్టేస్తున్నారు. గత వైసీపీ హయాంలో ఆ పార్టీ నాయకులు చేసిన భూ కబ్జాలపై గగ్గోలు పెట్టి

పోరాటం చేసిన ఈ టీడీపీ నాయకులు ఇపుడు అవే భూములను సక్రమం చేసేందుకు ప్రయత్నాలు చేస్తుండడం విశేషం. జగన్ హయాంలో కంటే కూటమి హయాంలో పీజీఆర్ ఎస్ వంటి ప్రజాప్రయోజన కార్యక్రమం మరింత దిగజారిందనే చెప్పవచ్చు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను సూచించిన గడువు లోగా పరిష్కరించగ పోగా పరిష్కారం అయినట్లు చూపిస్తుండడం అధికార యంత్రాంగం పరిస్థితిని తేటతెల్లం చేస్తుంది. మంత్రులు పత్రికా సమావేశాలు పెట్టడం తగ్గించారు. ఏ ప్రశ్నలను ఎదుర్కోవాల్సి ఉంటుందోనని వారికి భయం. ఇక మైనింగ్ మంత్రి కొల్లు రవీంద్ర అయితే పాత్రికేయులను తప్పించుకు తిరుగుతున్నారు. సుపరిపాలన అందిస్తున్నామని చెప్పే నాయకులు ఎందుకు భయపడుతున్నట్లు ? ఇదే పరిస్థితి కొనసాగితే రానున్న ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం పక్కన పెడితే ఘోర పరాజయం ఎదుర్కోవడం ఖాయం. పాలన ఎలానూ సరిగా లేదు. పోనీ పార్టీ పరిస్థితి అయినా సరిగా ఉందా అంటే అక్కడ కూడా దిగజారిన పరిస్థితులే, టీడీపీ గ్రాఫ్ పడిపోతుంటే జనసేన గ్రాఫ్ పెరుగుతుండడం కొసమెరుపు.



## హెల్దీ ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా...

**మొదటి పేజీ తరువాయి...**

కొనియాడారు. సాంకేతికత, ఆధ్యాత్మికతల కలయికతోనే సమాజ భవిష్యత్తు ముడిపడి ఉందని చంద్రబాబు స్పష్టం చేశారు.ఆధ్యాత్మికత, యోగా సాధన ద్వారానే హెల్దీ, వెల్దీ, హ్యాపీ ఆంధ్రప్రదేశ్ సాధ్యమవుతుందని చంద్రబాబు పేర్కొన్నారు. గతంలో విశాఖపట్నంలో 'యోగాంధ్ర-2025' పేరిట భారీ ఎత్తున కార్యక్రమాన్ని నిర్వహించి, ప్రధాని మోదీ సమక్షంలో గిన్నిస్ బుక్, ప్రపంచ రికార్డులను సృష్టించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. వచ్చే ఏడాది అంతర్జాతీయ యోగా వేడుకలను పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుపతిలో అత్యంత ఘనంగా నిర్వహిస్తామని ప్రకటించారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 1.33 లక్షల కేంద్రాలలో కోటి మందికి పైగా ప్రజలు యోగా సాధన చేస్తున్నారని, ఈ సంస్కృతిని ఇంటింటికీ చేర్చి ప్రజారోగ్యాన్ని కాపాడటమే తమ కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. యోగాను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంలో బాబా రామ్‌దేవ్ చేసిన అమోఘమైన కృషిని ఈ సందర్భంగా సీఎం అభినందించారు. రాష్ట్రంలో యోగా కార్యక్రమాలను పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా జిల్లా, మండల స్థాయి అధికారులను నియమిస్తామని, స్టాండర్డ్ యోగా ప్రొటోకాల్స్ రూపొందించడానికి ఒక నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేస్తామని చంద్రబాబు వెల్లడించారు. ఇందుకోసం 'యోగాంధ్ర' పేరిట ప్రత్యేక డిజిటల్ పోర్టల్‌ను కూడా తీసుకురానున్నారు. అలాగే, రాష్ట్రంలోని స్వర్ణ గ్రామ, వార్డు కార్యాలయాల్లో శాశ్వత యోగా మందిరాలను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలు జంక్ ఫుడ్, ఫాస్ట్ ఫుడ్‌లను పూర్తిగా దూరంగా పెట్టాలని, రసాయన రహిత ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవడం ద్వారా అనారోగ్యాలను దరిచేరనివ్వకుండా చూసుకోవచ్చని హితవు పలికారు. రాష్ట్రంలో పచ్చదనాన్ని (గ్రీన్ కవర్) 50 శాతానికి పెంచుతామని చెబుతూ రాబోయే ఆగస్టు 15వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్ఠాత్మక 'సంజీవని' ప్రాజెక్టును అమలు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ ప్రాజెక్టు ద్వారా వైద్య నిపుణులను ప్రజలకు చేరువ చేయడంతో పాటు యోగాను కూడా అందులో భాగం చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ రోజుకు ఒక గంట పాటు యోగా, ధ్యానం, ప్రాణాయామంకు కేటాయిస్తే అసలు ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సిన అవసరమే రాదని చంద్రబాబు పేర్కొన్నారు. అనంతరం వ్యసన ముక్త భారత ప్రచార యాత్ర వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పలువురు కేంద్రమంత్రులు, రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## రైతులను మోసం చేయడంలో..... చంద్రబాబు రికార్డు సృష్టించారు

**మొదటి పేజీ తరువాయి...**

వచ్చినా, ఒక్క సంవత్సరం కూడా తప్పలేదు. పైగా మేము మేనిఫెస్టోలో చెప్పినదానికన్నా మిన్నగా చేశాం. ఎన్నికల ముందు రాజమండ్రి వేదికగా నిలబడి, పీఎం-కిసాన్‌కు అదనంగా ప్రతి రైతు కుటుంబానికి ఏటా రూ.20 వేల ఇస్తానని ఘనంగా ప్రకటించారు. ఇప్పుడు అదే రైతులను మోసం చేసి, మళ్లీ రైతు ప్రేమికుడిలా మాట్లాడటం విడ్డూరంగా ఉంది. ఈ ట్వీట్‌కు మీరు మాట్లాడిన మాటలు జతచేస్తున్నాను. రైతులు కష్ట, నష్టాలు భరించి ఇన్సూరెన్స్ కట్టినా, మీరు ప్రభుత్వం నుంచి కట్టాల్సిన ప్రీమియంకూడా కట్టకపోవడంతో రైతాంగం తీవ్రంగా నష్టపోతోంది. కాని, మా హయాంలో రూ.7,802కోట్లు పంటల బీమా కింద ఇచ్చాం, రైతులు ఒక్క రూపాయి కూడా కట్టకుండానే. ..ఏ సీజన్లో నష్టం జరిగితే అదే సీజన్లో ఇచ్చే ఇన్‌పుట్ సబ్సిడీ ఆపేశారు. ఇప్పటికి 8 నెలలు దాటుతున్నా మొంథా తుపాను బాధిత రైతులకు ఇప్పటికీ ఒక్కపైసా ఇన్‌పుట్ సబ్సిడీ అందలేదు. రైతులకు అందే సున్నా వడ్డీ పథకాన్ని రద్దుచేశారు. ఉద్దేశ పూర్వకంగా ఆర్బీకేలను, ఈ-క్రాప్‌ను, టెస్టింగ్ ల్యాబులను నాశనం చేశారు. రైతులతో కలిసి ఆందోళన చేస్తామంటూ శ్రీ ఇచ్చిన అల్టిమేటంతో మళ్లీ కిలోకు రూ.4లు తగ్గిస్తామని ప్రకటించి, తీరాచూస్తే తగ్గించింది కేవలం రూ.2లు మాత్రమే. ఇక మీరు రైతులకు చేసిందేమిటి మోసం తప్ప పవర్ ఫ్యాక్టర్ పేరుతో ఆక్వారైతులకు మేం అమలు చేసిన కరెంటు సబ్సిడీ ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నారు. మామిడి రైతుల పరిస్థితీ అంతే. గత ఏడాది కిలోకు రూ.12లు చొప్పున రైతులకు ఇస్తామని ప్రకటించి, ఇవ్వాల్టికీ రూ.380కోట్లు ఇవ్వకుండా ఎగ్గొట్టారు. మళ్లీ ఈ ఏడాది ధరల సంక్షోభం వచ్చింది. కిలోకు రూ.4లు ఇస్తామంటూ మళ్లీ రైతులను మోసం చేయాలని చూస్తున్నారు. ఇంతకన్నా నిస్సిగ్గుతనం ఏముంటుంది. పొగాకు ధర కుప్పకూలిపోయినా మీకు చీమకుట్టినట్టైనా లేదు. సీఎం సరాసరి ధర కిలోకు రూ.200 ప్రకటిస్తే, ఆ మరుసటి రోజు ఆ ధర రూ.182లకు పడిపోయింది. ట్రాక్టర్లతో రైతులు చేసిన ఆందోళన మీ కళ్లకు కనిపించడంలేదా. ఇక మీరు రైతులకోసం ఏంచేసినట్టు చంద్రబాబూ మీరు రైతులకు ఇచ్చింది వాగ్దానాల మోసం, బకాయిల భారం, నిరాశ మాత్రమే అంటూ వైఎస్ జగన్ దుయ్యబట్టారు.

## ముంబైలో మళ్లీ కరోనా కేసుల కలకలం!

**ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:**

రుతుపవనాల రాక ఆలస్యం కావడంతో ముంబై నగరం వైరల్ వ్యాధుల గుప్పిట్లో చిక్కుకుంది. ముఖ్యంగా గత కొన్ని వారాలుగా కోవిడ్-19, స్వైన్ ఫ్లూ ఇన్ఫ్లుయెంజా వంటి శ్వాసకోశ ఇన్ఫెక్షన్ల కేసులు గణనీయంగా పెరిగాయి. దీంతో నగరంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి.తీవ్ర జ్వరం, ఒళ్లు నొప్పులు, దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలతో బాధపడుతూ అనేకమంది వైద్యులను ఆశ్రయిస్తున్నారు. దాదాపు నెల రోజుల పాటు స్వైన్ ఫ్లూ కేసులు అధికంగా నమోదు కాగా, గత వారం నుంచి కోవిడ్ కేసులు మళ్లీ పుంజుకున్నాయని వైద్యులు చెబుతున్నారు. బ్రీచ్ క్యాండీ వంటి ఆస్పత్రుల్లోని ల్యాబ్‌లలో ప్రతిరోజూ 7కు పైగా కోవిడ్ లేదా స్వైన్ ఫ్లూ పాజిటివ్ కేసులు వెలుగుచూస్తున్నాయి. ఒకేసారి పలు వైరస్‌లు వ్యాప్తిలో ఉండటంతో, లక్షణాలు ఒకేలా ఉండటంతో నిర్ధారణ కోసం పీసీఆర్ పరీక్షలు అవసరమవుతున్నాయని సీనియర్ వైద్యులు పేర్కొన్నారు. రుతుపవనాల రాక ఆలస్యం కావడం, వాతావరణంలో తేమ ఎక్కువగా ఉండటమే ఈ వైరస్‌ల వ్యాప్తికి ప్రధాన కారణంగా అధికారులు భావిస్తున్నారు. గాలిలో వైరస్‌లు ఎక్కువసేపు నిలిచిపోవడానికి ఈ పరిస్థితులు దోహదపడుతున్నాయని బీఎంసీ ఎగ్జిక్యూటివ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ దక్షా షా తెలిపారు. వర్షాలు విస్తారంగా కురిస్తే వాతావరణం శుభ్రపడి, వైరస్‌ల వ్యాప్తి తగ్గుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం నమోదవుతున్న కేసుల్లో ఎక్కువ శాతం స్వల్ప లక్షణాలతోనే ఉన్నప్పటికీ, వృద్ధులు, గర్భిణులు, మధుమేహం, దీర్ఘకాలిక ఊపిరితిత్తుల వ్యాధులు ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. సొంతంగా యాంటీబయాటిక్స్ వాడొద్దని, లక్షణాలు తీవ్రంగా ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు. రద్దీ ప్రాంతాల్లో మాస్కులు ధరించడం, చేతులు శుభ్రంగా ఉంచుకోవడం వంటి జాగ్రత్తలు పాటించాలని అధికారులు కోరుతున్నారు.

## తమిళనాడులో ఘోర ప్రమాదం

**మొదటి పేజీ తరువాయి...**



కోల్పోయారు. మృతుల్లో ఆరుగురు మహిళలు ఉన్నారు. ఈ దుర్ఘటనలో మరో 74 మందికి పైగా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వారిని సమీప ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు.వివరాల్లోకి వెళితే, తిరువళ్లూరు జిల్లా పెరియపాళయం సమీపంలోని కన్నిగైపెట్టై గ్రామంలో ఉన్న రొయ్యల ప్రాసెసింగ్ కంపెనీలో ఈ ప్రమాదం జరిగింది. ఫ్యాక్టరీలో అమోనియా గ్యాస్ ఒక్కసారిగా లీక్ కావడంతో అక్కడ పనిచేస్తున్న కార్మికులు ఊపిరాడక కుప్పకూలిపోయారు. బాధితుల్లో ఎక్కువ మంది ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన వారేనని తెలుస్తోంది. వీరిలో చాలా మంది 24-25 ఏళ్ల వయసున్న యువతులే ఉన్నారు.ప్రమాదం జరిగిన వెంటనే బాధితులను సమీపంలోని వేల్స్, వెంకటేశ్వర ఆసుపత్రులకు తరలించారు. వీరిలో 9 మంది పరిస్థితి విషమంగా ఉండటంతో, మెరుగైన చికిత్స కోసం చెన్నైలోని స్టాన్లీ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం 11 మంది వెంటిలేటర్లపై ఉన్నారని, మరికొందరికి ఇంటబేషన్ చేశామని వైద్యులు తెలిపారు. కోల్డ్ స్టోరేజ్ యూనిట్‌లోని వాల్వ్ ఫెయిల్ కావడం వల్లే గ్యాస్ లీక్ అయినట్లు ప్రాథమికంగా గుర్తించారు. సమాచారం అందుకున్న తిరువళ్లూరు జిల్లా కలెక్టర్ ఎస్. కవిత ఘటనా స్థలాన్ని, ఆసుపత్రులను సందర్శించారు. ప్రమాదానికి గల కారణాలపై, కంపెనీలో భద్రతా లోపాలపై పూర్తిస్థాయి విచారణకు ఆదేశించినట్లు ఆమె వెల్లడించారు.

## ఇరాన్‌పై ఇజ్రాయిల్ దాడులతో.... మళ్ళీ మొదటికొచ్చిన సంక్షోభం

**మొదటి పేజీ తరువాయి...**

డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికలు జారీ చేశారు. లెబనాన్‌లో సమస్యలు సృష్టించకుండా అక్కడి 'ప్రాక్సీ'లను వెంటనే నిలువరించాలని సూచించారు. లేనిపక్షంలో ఇరాన్‌పై మరోసారి భీకర స్థాయిలో విరుచుకుపడతామని 'ట్రూత్ సోషల్'లో పోస్టు పెట్టారు.చర్చల ప్రారంభానికి ముందు జేడీ వాన్స్ మాట్లాడుతూ హర్మూజ్ జలసంధిని తెరవడం, ఇరాన్ అణు కార్యక్రమానికి ముగింపు పలకడం వంటివన్నీ ఇప్పటికే పూర్తయ్యాయని చెప్పారు. "మనం ఇంకా ఎంత సాధించగలం. పశ్చిమాసియాకు సంబంధించి కొత్త అధ్యాయాన్ని ప్రారంభించగలమా ఇక్కడి సంబంధాలను శాశ్వతంగా మార్చగలమా, లేదా పాత పద్ధతిలోనే వెళ్లడమా అనే ప్రశ్నలు తమందరి ముందు ఉన్నాయన్నారు. ఈ చర్చలను చరిత్రాత్మకంగా పేర్కొంటూ ఇరుదేశాల మధ్య ఇంతటి ఉన్నత స్థాయి సమావేశం గతంలో ఎప్పుడూ జరగలేదని చెప్పారు. అమెరికా , ఇరాన్ మధ్య రెండు రోజుల క్రితమే చర్చలు ప్రారంభం కావాల్సి ఉండగా వాయిదా పడ్డాయి. తాత్కాలిక ఒప్పందం కుదిరిన కొన్ని గంటలకే ఇజ్రాయెల్ , లెబనాన్‌లోని హెజ్‌బొల్లా మధ్య పోరాటం తీవ్రతరమైంది. లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో పదుల కొద్దీ స్థానికులు మృతి చెందారు. ఈ దాడులను నిరసిస్తూ ఇరాన్ ప్రతినిధులు స్విట్జర్లాండ్ ప్రయాణాన్ని రద్దు చేసుకున్నారు. చర్చలు కొనసాగాలంటే లెబనాన్‌పై దాడులను ఆపాలని డిమాండ్ చేశారు. అయితే, తాజాగా చర్చలు ప్రారంభమైన వేళ లెబనాన్‌ను ఉటంకిస్తూ ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరికలు జారీ చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.




## రెండేళ్ల కూటమి పాలనపై 'ప్రోగ్రెస్ రిపోర్ట్'లు

### ప్రభుత్వాన్ని ఎలా గాడిన పెట్టామో చెప్పడంతో పాటు ఫేక్ న్యూస్‌కు చెక్ పెట్టడమే ప్రోగ్రెస్ రిపోర్టుల లక్ష్యం

**ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:**

రెండేళ్ల పాలనలో కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు 'ప్రోగ్రెస్ రిపోర్ట్‌లు' విడుదల చేయాలని ఏపీ సీఎం చంద్రబాబు ఆదేశించారు. గత ప్రభుత్వ పాలనపై 2024లో అధికారం చేపట్టిన తర్వాత విడుదల చేసిన 7 శ్వేతపత్రాలపై తీసుకున్న చర్యల్లా ఈ నివేదికలు ఉండాలని మంత్రులు, అధికారులకు ఆయన స్పష్టం చేశారు. ప్రోగ్రెస్ రిపోర్టుల విడుదలపై మంత్రులు, అధికారులతో క్యాంపు కార్యాలయంలో సీఎం సమీక్ష నిర్వహించారు. రెండేళ్ల క్రితం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, పోలవరం ప్రాజెక్టు, రాజధాని అమరావతి, విద్యుత్, శాంతి భద్రతలు, మైనింగ్, ఎక్సైజ్ రంగాలపై ముఖ్యమంత్రి శ్వేత పత్రాలు విడుదల చేశారు. వైకాపా పాలనతో విధ్వంసమైన రాష్ట్రాన్ని ఈ ప్రభుత్వం రెండేళ్లలో వికాసం వైపు ఎలా తీసుకెళ్లింది.రాష్ట్రం అన్ని రంగాల్లో ఎలా పురోగతి సాధించింది తదితర అంశాలను తాజా ప్రోగ్రెస్ రిపోర్టులో పొందుపరచాలని సీఎం దిశానిర్దేశం చేశారు. రెండేళ్లలో చాలా శాఖల్లో ఎన్నో మార్పులు తీసుకువచ్చామని సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, గవర్నెన్స్‌లో తెచ్చిన సంస్కరణలు ప్రజలకు తెలియాల్సిన అవసరముందన్నారు. ప్రభుత్వాన్ని ఎలా గాడిన పెట్టామో చెప్పడంతో పాటు ఫేక్ న్యూస్‌కు చెక్ పెట్టడమే ప్రోగ్రెస్ రిపోర్టుల ఉద్దేశమన్నారు.



## రక్షణ రంగంలో భారత్ కొనుగోలుదారుగా ఉండబోదు

**మొదటి పేజీ తరువాయి...**

నిర్మాణంలో 200కు పైగా ఎంఎస్ఎంఈలు పాలుపంచుకున్నాయి. ఈ 200 చిన్న పరిశ్రమలు ఎన్ని భారీ సంఖ్యలో ఉద్యోగాలను సృష్టించి ఉంటాయో మనం ఊహించవచ్చు. భారత్ తన సముద్ర శక్తిలో తదుపరి దశలోకి ప్రవేశించాల్సిన సమయం ఆసన్నమైంది. అందువల్ల, నౌకా నిర్మాణ రంగానికి సంబంధించి భారత్ ఒక నూతన దృక్పథంతో ముందుకు సాగుతోంది. ఇటీవలి సంవత్సరాల్లో అనేక విధాన సంస్కరణలు అమలు చేశాం. దేశీయ ఉత్పాదక సామర్థ్యాన్ని పెంచడానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నాం. నౌకా నిర్మాణం, మరమ్మత్తు, రీసైక్లింగ్, ఎంఆర్‌ఓలను ఒక ప్రధాన జాతీయ లక్ష్యంగా పరిగణిస్తున్నాం. నౌకా రవాణా రంగానికి ప్రకటించిన రూ. 70 వేల కోట్ల ప్రోత్సాహక ప్యాకేజీ కేవలం ఆర్థిక నిర్ణయం మాత్రమే కాదు. ఇది భారతదేశ సముద్ర భవిష్యత్తులో ఒక పెట్టుబడిగా భావిస్తున్నాం. భారతీయ పరిశ్రమలు, ఇంజనీర్ల నైపుణ్యం, కార్మికుల కృషి ఇదే నూతన భారతదేశానికి అతిపెద్ద బలం. ప్రస్తుతం భారతదేశం రక్షణ రంగంలో కేవలం కొనుగోలుదారుగా మిగిలిపోవాలని కోరుకోవడం లేదు. మన సైనిక శక్తి ప్రపంచానికి మార్కెట్‌గా మారకూడదు." --నరేంద్ర మోదీ, ప్రధానమంత్రి. "భారతదేశం ఒక సృష్టికర్తగా ఎదగాలని ఆకాంక్షిస్తోంది. మనం సృష్టికర్తలుగా మారిన రోజు నిర్ణయాలు తీసుకునే స్థాయికి ఎదుగుతాము. మనం ప్రస్తుతం ఈ దిశగా వేగంగా పయనిస్తున్నాము. ఇటీవలి సంవత్సరాల్లో 40కి పైగా 'మేడ్-ఇన్-ఇండియా' యుద్ధనౌకలు, జలాంతర్గాములు నౌకాదళంలో చేరాయి. భారత నౌకాదళం దాదాపు ప్రతి కొన్ని వారాలకు ఒక కొత్త బలాన్ని తనలో చేర్చుకుంటుంది. ప్రస్తుతం 45 పెద్ద నౌకాదళ ప్లాట్‌ఫారమ్‌లు నిర్మాణంలో ఉన్నాయి. ఇది కేవలం ఒక సంఖ్య మాత్రమే కాదు. భారతదేశ పారిశ్రామిక సామర్థ్యానికి నిదర్శనం. ఇది భారతదేశ భవిష్యత్తుకు ఒక సంకేతం. రాబోయే సంవత్సరాల్లో భారతదేశ సముద్ర రంగం లక్షలాది కొత్త ఉద్యోగాలను సృష్టించే సామర్థ్యాన్ని కలిగి ఉంది. అందుకే మేము సముద్ర రంగాన్ని కేవలం ఒక ప్రత్యేక రంగంగా పరిగణించడం లేదు. దీనిని అభివృద్ధి చెందిన భారతదేశానికి ఉపాధి కల్పించే చోదక శక్తిగా చూస్తాం. ఒక ఆధునిక నౌకకు వందల టన్నుల ఉక్కు, ఎలక్ట్రానిక్స్, యంత్రాలు, వేలాది విడిభాగాలు అవసరం పడతాయి. వీటన్నిటి వెనుక వేలాది కంపెనీలు పనిచేస్తాయి. ఫలితంగా వేలాది మంది యువతకు ఉపాధి లభిస్తుందని ప్రధాని మోదీ అన్నారు. ల "భారతదేశం తన మొత్తం సముద్ర వాణిజ్య వ్యవస్థను బలోపేతం చేస్తోంది. అందువల్ల, భారత్ తన ఓడరేవులను ఆధునీకరిస్తోంది. కొత్త సామర్థ్యాన్ని సృష్టిస్తోంది. కొత్త అనుసంధానాన్ని నిర్మిస్తోంది. నదీ జలమార్గాలను విస్తరిస్తోంది. బహుళ-రవాణా లాజిస్టిక్స్ నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేస్తోంది. సాగరమాల వంటి కార్యక్రమాలు ఈ విస్తృత దృక్పథంలో భాగమే. ఇది వాణిజ్య వ్యయాలను తగ్గిస్తూ, పరిశ్రమలను ఉత్తేజపరుస్తూ, తీర ప్రాంతాల్లో కొత్త అవకాశాలను సృష్టిస్తోంది. భారత్‌లో తయారైన రక్షణ పరికరాలు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా 80కి పైగా దేశాలకు చేరుతున్నాయి. స్వావలంబన దిశగా సాగే ప్రయాణంలో ఇంకా చాలా చేయాల్సి ఉంది. నా అభిప్రాయంలో ఇది కేవలం ఆరంభం మాత్రమే." అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు.

## కరీంనగర్‌లో ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సులో మంటలు..

**మొదటి పేజీ తరువాయి...**

ప్రయాణికులతో హైదరాబాద్‌కు బయలుదేరింది. బస్సు అలుగునూరు దాటి కాకతీయ కాలువ సమీపానికి చేరుకోగానే ఇంజిన్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. వెంటనే గమనించిన డ్రైవర్ ప్రశాంత్, బస్సును రోడ్డు పక్కన ఆపివేశారు. క్షణాల్లోనే ఆయన బస్సు డోర్‌తో పాటు ఎమర్జెన్సీ ద్వారాన్ని కూడా తెరిచి ప్రయాణికులందరినీ కిందకు దింపేశారు. ప్రయాణికులు కిందకు దిగిన నిమిషాల వ్యవధిలోనే బస్సు మొత్తం మంటల్లో చిక్కుకుని పూర్తిగా దగ్ధమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో ప్రయాణికులతో పాటు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. డ్రైవర్ అప్రమత్తత వల్లే పెను ప్రమాదం తప్పిందని ప్రయాణికులు తెలిపారు.

# అక్రమ నిర్మాణం వెనుక భారీ స్కెచ్...?

### 800 గజాల మిగులు భూములపై ముఠా కన్ను

### 53 గజాల ప్లాన్.. 350 గజాల నిర్మాణంపై రెవెన్యూ, జీవీఎంసీ అధికారుల మల్లగుల్లాలు

**విశాఖపట్నం, జూన్ 21, జయ జయహే :**

జీవీఎంసీ 98 వార్డు సింహాచలం దరి ప్రియాగార్డెన్స్‌లో సర్వే నంబర్లు 176, 177లో జరుగుతున్న వ్యవహారం సాధారణ అక్రమ నిర్మాణం కాదని, కోట్ల రూపాయల విలువైన మిగులు భూమిని కాజేసే భారీ స్కెచ్‌గా మారిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఆక్రమణ ముఠా, స్థానిక రాజకీయ నాయకులు, అధికారుల మౌనం కలిసి నడుస్తున్నాయా అనే అనుమానాలు లేకపోలేదు..! కోట్ల విలువైన మిగులు భూమిని తెలివిగా కాజేసే కుట్ర దాగి ఉందా..అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంలో తెరవెనుక రాజకీయ హస్తం ఎవరిది..? అధికారులపై ఒత్తిళ్లు వంటి అంశాలు తెరపైకి వస్తున్నాయి. ఈ అక్రమ నిర్మాణాల వ్యవహారం రోజుకో కొత్త మలుపు తిరుగుతోంది. 53 గజాల స్థలానికి ప్లాన్ పెట్టి 350 గజాలలో నిర్మాణం చేసి.. మరోవైపు మిగిలిన భూమిని కూడా ఆక్రమించారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఇలా అనేక ప్రశ్నలు ఇప్పుడు స్థానికుల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ఇప్పటి వరకూ ఈ భూమికి సంబందించి జీవీఎంసీ, దేవస్థానం, రెవెన్యూ అధికారులు దీనిపై ఎలాంటి అధికారిక ఉత్తర్వులు జారీ చేయలేదు.

**తవ్వేకొద్దీ ముఠా లీలలు.. సరికొత్త అంశాలు...!**

ఈ భూమికి సంబంధించి అసలు స్థలం 53 గజాలే విక్రయించినప్పటికీ లింక్ డాక్యుమెంట్లను ఆధారంగా చూపిస్తూ 800 గజాల మిగులు భూమి కూడా ఈ ముఠా ఆక్రమించారన్న విమర్శలు వస్తున్నాయి. ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం సుమారు నాలుగు కోట్ల రూపాయలు విలువ చేసే మిగులు భూమిని రెవెన్యూ అధికారులు ఎందుకు కాపాడడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ భూమి విషయంలో సాధారణ ప్రజలపై కఠిన చర్యలు తీసుకునే





రెవెన్యూ అధికారులు రూ. కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కాపాడడంలో ఎందుకు మౌనం వహిస్తున్నారన్న దానిపై ఒక్కో రకంగా మాట్లాడుకుంటున్నారు. గతంలో కొండలపై నుంచి వచ్చే వర్షపు నీరు మొత్తం ఈ మిగులు భూమి గుండా ప్రవహించేది. ప్రస్తుతం మట్టితో కప్పేయడంతో వర్షపు నీరు వెళ్లే మార్గాలు మూసుకుపోవడంతో భవిష్యత్తులో నీళ్లకు ఇబ్బందులు తప్పవని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.

**అధికారులు డైలమాలో పడ్డారా..?**

స్థానిక రాజకీయ నాయకుల ఒత్తిళ్ల కారణంగా సంబంధిత అధికారులు అక్రమ నిర్మాణాన్ని వదిలేసారా అని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏం చేయాలో తెలియని డైలమాలో జీవీఎంసీ, రెవెన్యూ అధికారులు పడ్డారనే ప్రచారం జోరందుకుంది. చిన్నపాటి షెడ్లు, ప్రహరీ గోడలను వెంటనే తొలగించే అధికారులు, ఈ భారీ నిర్మాణం విషయంలో ఎందుకు మౌనం వహిస్తున్నారనే దానిపై భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. డ్రోన్ సర్వేలు, శాటిలైట్ మ్యాపులు, ఫీల్డ్ ఇన్స్పెక్షన్లు ఉన్న ఈ రోజుల్లో 53 గజాల స్థలంలో 350 గజాలు నిర్మాణం..800 గజాల కథగా ఎలా మారిందో అధికారులకు తెలియదా అని ప్రజలు నవ్వుతున్నారు.

**దాసరికి ముందే తెలుసా..?**

అసలు ఈ భూమి విషయంలో చర్చ లోతుగా జరుగుతోంది. దాసరి సన్యాసిశెట్టికి ఎంత భూమి ఉంది..? ఆయన ఎవరెవరికి ఎంత విక్రయించారు? మిగిలిన భూమి ఎంత..? అనే ప్రశ్నలు స్థానికంగా చర్చకు దారి తీసాయి. కేవలం ఆయన వద్ద ఉన్న రిజిస్టర్డ్ డాక్యుమెంట్‌ని అడ్డం పెట్టుకుని మిగుల భూమి కొట్టేయడానికి "ముఠా స్కెచ్ వేశారా "అనే అనుమానాలు జోరుగా ఊపందుకున్నాయి. దాసరి పాత రిజిస్టర్డ్ సేల్ డీడ్‌లో పొందుపరిచిన విస్తీర్ణం, భూమి హద్దులు, ప్రస్తుతం భౌతిక భూమి తో సరిపోయాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భూమి మొత్తాన్ని రీ సర్వే తో అసలు నిజాలు బయటకు వస్తాయని స్థానికులు భావిస్తున్నారు. ముఠా ఆక్రమణలు దాసరికి ముందే తెలుసనే పుకార్లు కూడా వినిపిస్తున్న నేపథ్యంలో ఈ ప్రశ్నలన్నిటికీ రెవెన్యూ అధికారులే నిగ్గు తేల్చాలని స్థానికులు కోరుతున్నారు.

**కలెక్టర్ సార్ స్పందించరూ....!**

ఈ మొత్తం భూ వ్యవహారంపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి పూర్తి స్థాయి సర్వే నిర్వహించి నిజా నిజాలు వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ భూమికి సంబంధించి స్థానికుల్లో అనేక అనుమానాలు వున్న నేపథ్యంలో అసలు వాస్తవాలు ఏంటో రెవెన్యూ వర్గాలు తేటతెల్లం చేయాలంటున్నారు. మిగులు భూమిని నివాసితులకు అనుగుణంగా స్థానికులు భవిష్యత్ అవసరాల నిమిత్తం ఫెన్సింగ్ వేసి కాపాడాలని, అలాగే విజిలెన్స్ విచారణ చేపట్టి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు జిల్లా కలెక్టర్‌ను కోరుతున్నారు.



## కొత్త ఓటర్ల నమోదు ప్రారంభం

**విశాఖపట్నం (జయ జయహే)**

ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ ఇంటింటి సర్వే ఆదివారం అధికారికంగా ప్రారంభమైంది. జూలై 14 వరకు నెల రోజుల పాటు జరిగే ఈ సర్వేలో ఓటర్ల జాబితా ప్రక్షాళన, కొత్త ఓటర్ల నమోదు, అనర్హుల తొలగింపు లక్ష్యంగా ఎన్నికల సంఘం ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా జీవీఎంసీ 25వ వార్డు గురుద్వార్ పాత పెట్రోల్ బంకు , గణేష్ నగర్ ప్రాంతం 133 బూతు పరిధిలో నిర్వహించిన సర్వేలో బీఎల్ఓ హేమ, తహసీల్దార్ ఎంవీవీ ప్రసాద్ లతో కలిసి వివిధ పార్టీల ప్రతినిధులు సారిపిల్లి సంతోష్, కమ్మకట్ల రామిరెడ్డి, నరాల బాలకృష్ణ, బంధపు భవాని, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.




## కొయ్యూరు మండలంలో జెఎస్ జెబి పనుల ఫీల్డ్ వెరిఫికేషన్...

### నీటి వనరుల అభివృద్ధే లక్ష్యం...

### నోడల్ అధికారి సత్యనారాయణ..

**కొయ్యురు :(జయ జయహే ) న్యూస్ జూన్ 22.**

జల సంవర్ధన జల భగీరది కార్యక్రమంలో భాగంగా కొయ్యూరు మండల పరిధిలోని కొయ్యూరు, మంప, రెవల్లు గ్రామాల్లో ఆదివారం ఫీల్డ్ వెరిఫికేషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జెఎస్ జెబి నోడల్ అధికారి జి. సత్యనారాయణ , ఏంపిడిఓ జి డి వి ప్రసాదరావు , ఏపిఓ (ఎన్ ఆర్ ఈ జి ఎస్) అప్పలరాజు సంయుక్తంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా నోడల్ అధికారి సత్యనారాయణ మాట్లాడుతూ భూగర్భ జలాల పరిరక్షణ, వర్షపు నీటి నిల్వ, నీటి వనరుల అభివృద్ధి జెఎస్ జెబి పథకం ప్రధాన లక్ష్యం. ప్రజల భాగస్వామ్యంతో చేపట్టే ఈ పనులు గ్రామాల్లో తాగునీటి సమస్యల పరిష్కారానికి దోహదపడతాయి అని తెలిపారు. అధికారులు మూడు గ్రామాల్లో జరుగుతున్న పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పనుల నాణ్యత, మెటీరియల్ వినియోగం, మస్టర్ రోల్స్‌ను తనిఖీ చేశారు. పనులు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం, నిర్ణీత ప్రమాణాలతో జరుగుతున్నాయని అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. పనిచేస్తున్న కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా, అవినీతి రహితంగా అమలు అవుతున్నాయని, ఇలాంటి క్షేత్రస్థాయి పర్యవేక్షణ నిరంతరం కొనసాగుతుందని ఏంపిడిఓ జిడివి ప్రసాదరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత ఫీల్డ్ సిబ్బంది, గ్రామ సిబ్బంది పాల్గొన్నారు.






## ప్రతి ఇంట్లో యోగ అలవాటుగా మారాలి: ఎమ్మెల్యే కొణతాల

**అనకాపల్లి జూన్ 21( జయ జయహే)**

12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని అనకాపల్లి చ బొజ్జన్న కొండ వద్ద నిర్వహించబడిన యోగా ఆంధ్ర 2026 కార్యక్రమంలో భాగంగా స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ కార్యక్రమంలో పాల్గొని యోగ అభ్యాసం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, పీల గోవిందు సత్యనారాయణ యోగ అభ్యాసంలో పాల్గొన్నారు కూటమి కార్యకర్తలు నాయకులు నిత్యం యోగా చేసే అభిమానులు ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామకృష్ణ మాట్లాడుతూ యోగ భారతదేశంలో ప్రపంచానికి అందించిన అపురూపమైన జీవన విధానం అని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరు యోగాను దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని ఆయన అక్కడ వారికి పిలుపునిచ్చారు ఒకప్పుడు భారతీయ జీవన శైలిలో భాగంగా ఉన్న యోగ కాలక్రమేనా మరుగున పడిందని దానిని ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందేలా చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కృషి అభినందనియమని, ఆరోగ్యం ఉంటేనే జీవితం ఆనందమయమని, అభివృద్ధి సాధ్య మవుతాయని ప్రతి వ్యక్తి రోజుకు కనీసం ఒక గంట సమయాన్ని యోగాకు కేటాయించాలని ముఖ్యంగా తల్లిదండ్రులు ముందుగా అలవాటు చేసుకుంటే వారి పిల్లలు కూడా దానిని అనుసరిస్తారని యోగ కేవలం శారీరక వ్యాయామ మాత్రమే కాదని మానసిక ప్రశాంతతను అందిస్తుందని జీవన శైలి నాణ్యతను మెరుగు పరుస్తుందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందడం సంతోషకరమని విద్యార్థుల యోగా పట్ల ఆసక్తి పెంపొందించేందుకు అన్ని పాఠశాలలో యోగా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని ఈ మేరకు యోగా శిక్షకులు విద్యాశాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని దీని గురించి కార్యాచరణ రూపొందించాలని ఆయన ప్రతిపాదించారు. జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ నాయకత్వంలో అనకాపల్లి జిల్లా అన్ని రంగాల్లో పురోగతి సాధిస్తున్నదని యోగ ప్రచారంలో కలెక్టర్ స్వయంగా ఈ కార్యక్రమానికి వచ్చి ఆదర్శంగా నిలబడి నిలిచారాని ఆయన ప్రశంసించారు .ఈ కార్యక్రమం అత్యంత విజయవంతంగా నిర్వహించిన అధికారులకు యోగా గురువులకు వివిధ శాఖల సిబ్బందికి విద్యార్థిని విద్యార్థులకు ఉపాధ్యాయులకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలియజేశారు యోగ విన్యాసాలు చేసిన వారికి పాల్గొన్న వారికి మరియు ఉద్యోగస్తులకు ఈ సందర్భంగా ప్రశంసా పత్రాలు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు, మహిళలు ,వివిధ డిపార్ట్మెంట్లో ఉద్యోగులు పోలీస్ డిపార్ట్మెంట్ ,యోగ సాధకులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది

### విజయవాడ యువకుడు సాయికృష్ణ కేసు..

# దర్యాప్తునకు సిట్ ఏర్పాటు

మొదటి పేజీ తరువాయి...

బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసింది. శాంతిభద్రతల విభాగం ఇన్‌స్పెక్టర్ జనరల్ (ఐజీ) ఎం. రవి ప్రకాశ్ ఈ సిట్‌కు నేతృత్వం వహించనున్నారు. శ్రీఈ ప్రత్యేక దర్యాప్తు బృందంలో పశ్చిమ గోదావరి ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మీ, అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్ సభ్యులుగా ఉంటారని, బాపట్ల జిల్లా అదనపు ఎస్పీ ఎల్. సుధాకర్‌ను దర్యాప్తు అధికారిగా నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. విచారణను వేగంగా పూర్తి చేసేందుకు అవసరమైన సిబ్బందిని, సాంకేతిక, ఫోరెన్సిక్ సహకారాన్ని పోలీస్ శాఖలోని వివిధ విభాగాల నుంచి తీసుకునేందుకు సిట్‌కు పూర్తి అధికారాలు కల్పించారు. ఈ కేసులో ప్రధాన ఆరోపణలు ఎదుర్కొంటున్న కృష్ణలంక పోలీస్ స్టేషన్ సస్పెండెడ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ) నాగరాజు చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. అక్రమ నిర్బంధం, హత్య సాక్ష్యాల ధ్వంసం వంటి ఆరోపణలపై సిట్ దర్యాప్తు చేయనుంది. మృతుడు సాయికృష్ణ తల్లి గాదె విజయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూన్ 19న సీఐ నాగరాజుపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్లు 127(4), 127(6), 103(1), 238 కింద కేసు నమోదు చేశారు. సింగ్ నగర్‌లోని ఆయన నివాసంలో టాస్క్ ఫోర్స్ పోలీసులు విచారణ జరుపుతున్నారు. విచారణ అనంతరం నాగరాజును అరెస్ట్ చేసే అవకాశం ఉంది.

**అసలేం జరిగింది?**

విచారణ పేరుతో మే 9న తన కుమారుడిని పోలీసులు తీసుకెళ్లారని, అప్పటి నుంచి అతను తిరిగి రాలేదని తల్లి విజయలక్ష్మి ఆరోపిస్తున్నారు. కస్టడీలో చిత్రహింసలకు గురి చేసి, కొట్టి చంపేశారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ క్రమంలో ఆమె హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేయగా, జూన్ 15న సాయి కృష్ణను కోర్టులో హాజరుపరచాలని పోలీసులను న్యాయస్థానం ఆదేశించింది. పోలీసులు విఫలం కావడంతో గడువును జూన్ 29కి పొడిగించింది.

ఈ ఘటనపై స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జూన్ 17న సీనియర్ ఐపీఎస్ అధికారితో దర్యాప్తునకు ఆదేశించడమే కాకుండా సీఐ నాగరాజును తక్షణమే సస్పెండ్ చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. దర్యాప్తు బృందాలు ఇప్పటికే విజయలక్ష్మి, ఇతరుల వాంగ్మూలాలను నమోదు చేసి, సీసీటీవీ ఫుటేజీని, ఇతర సాంకేతిక ఆధారాలను సేకరించాయి. సాయికృష్ణను చంపి దహనం చేశారని తల్లి ఆరోపించిన నేపథ్యంలో కృష్ణలంకలోని శ్మశానవాటికలో మే 23 నుంచి 26 మధ్య దహనం చేసిన అనాథ శవాల రికార్డులను కూడా అధికారులు పరిశీలిస్తున్నారు. మరోవైపు మే 1 నుంచి జూన్ 1 వరకు కృష్ణలంక పోలీస్ స్టేషన్ సీసీటీవీ ఫుటేజీని, సాయి కృష్ణ, అతని తల్లి మొబైల్ ఫోన్ల కాల్ డేటా రికార్డులను భద్రపరచాలని న్యాయస్థానం పోలీసులను ఆదేశించింది. న్యాయస్థానం ఆదేశించింది. పోలీసులు విఫలం కావడంతో గడువును జూన్ 29కి పొడిగించింది. ఈ ఘటనపై స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జూన్ 17న సీనియర్ ఐపీఎస్ అధికారితో దర్యాప్తునకు ఆదేశించడమే కాకుండా సీఐ నాగరాజును తక్షణమే సస్పెండ్ చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. దర్యాప్తు బృందాలు ఇప్పటికే విజయలక్ష్మి, ఇతరుల వాంగ్మూలాలను నమోదు చేసి, సీసీటీవీ ఫుటేజీని, ఇతర సాంకేతిక ఆధారాలను సేకరించాయి. సాయికృష్ణను చంపి దహనం చేశారని తల్లి ఆరోపించిన నేపథ్యంలో కృష్ణలంకలోని శ్మశానవాటికలో మే 23 నుంచి 26 మధ్య దహనం చేసిన అనాథ శవాల రికార్డులను కూడా అధికారులు పరిశీలిస్తున్నారు. మరోవైపు మే 1 నుంచి జూన్ 1 వరకు కృష్ణలంక పోలీస్ స్టేషన్ సీసీటీవీ ఫుటేజీని, సాయి కృష్ణ, అతని తల్లి మొబైల్ ఫోన్ల కాల్ డేటా రికార్డులను భద్రపరచాలని న్యాయస్థానం పోలీసులను ఆదేశించింది.



## చంద్రంపాలెం హై స్కూల్‌లో అభివృద్ధి పనుల పరిశీలన

**భీమిలి (జయ జయహే)**

బీమిలి చంద్రంపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను గంటా రవితేజ సందర్శించి, దివిస్ సంస్థ సహకారంతో నిర్మిస్తున్న ఆధునిక ప్లే గ్రౌండ్ నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల పురోగతిని తెలుసుకుని, విద్యార్థులకు మెరుగైన క్రీడా సౌకర్యాలు అందేలా నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం పాఠశాలలో ఉన్న మౌలిక సదుపాయాల పరిస్థితిని సమీక్షించి, విద్యార్థుల సౌకర్యార్థం అవసరమైన ఫ్యాన్లు, స్విచ్ బోర్డులు మరియు ఇతర మరమ్మత్తు పనులను తక్షణమే పూర్తి చేయాలని అధికారులను తెలియజేశారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు అవసరమైన ప్రతి అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ ప్రేమ్ కుమార్, ఎంఈఓ అనురాధ, సమగ్ర శిక్ష ఈఈ నరసింహం, ఎం.ఆర్.జి. నాయుడు, పార్టీ నాయకులు చిక్కాల విజయ్ బాబు, యార్లగడ్డ జీవన్ కుమార్, ఎస్ఎంసీ కమిటీ సభ్యులు, ప్రధానోపాధ్యాయులు మరియు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

For a pure tomorrow.. జయహో

# రైతన్నా నకిలీ విత్తనాలతో జర జాగ్రత్త

## రైతులకు శాపంగా మారుతున్న నకిలీ విత్తనాలు... రైతులను నిండా ముంచుతున్న నకిలీ విత్తన మాఫియా


ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. రైతులు తమ పొలాలను సిద్ధం చేసుకుంటూ, నాణ్యమైన విత్తనాల కోసం ఫెర్టిలైజర్ షాపులు, విత్తన విక్రయ కేంద్రాల చుట్టూలి తిరుగుతున్నారు. కానీ... రైతులు నమ్మి కొనుగోలు చేస్తున్న విత్తనాలన్నీ నాణ్యమైనవేనా ?

వ్యవసాయంలో విత్తనం పాత్ర అమూల్యమైనది. ఒక రైతు వ్యవసాయం లాభసాటిగా ఉండాలంటే, మొదటి మెట్టు నాణ్యమైన విత్తనం ఎంపికే. విత్తన నాణ్యత పైనే పంట దిగుబడి , నాణ్యత,, రైతు ఆదాయం అన్నీ ఆధారపడతాయి.

కానీ ఇటీవల కాలంలో నకిలీ విత్తనాల మాఫియా వ్యవసాయాన్ని భూతంగా మింగేస్తోంది. కొందరు వ్యాపార లాభాల కోసం రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని నకిలీ విత్తనాలను విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. ఎటువంటి ప్రమాణాలు లేకుండా సరఫరాలిఅవుతున్న ఈ విత్తనాలు నాటిన తర్వాత మొలకే రావడం లేదు... మొలక వచ్చినా సరైన దిగుబడి లిరావడం లేదు... చివరికి రైతులకు దిగుబడి నష్టం, అప్పుల భారంతో పాటు మానసిక ఆందోళనతో చివరికి ఆత్మహత్య చేసుకునే పరిస్థితికి చేరుకున్నాడు

ప్రభుత్వాలు ఎన్ని చర్యలు తీసుకున్నా ఈ నకిలీ దందా యధాతథంగా కొనసాగుతూనే ఉందిలి





### నకిలీ విత్తనం అంటే ఏమిటి?

నకిలీ విత్తనం అనగా నిజమైన రకం కాని విత్తనం, లేదా ఉద్దేశించిన విత్తన రకానికి సరిపోలని విత్తనం, లేదా ధ్రువీకరణ పొందని విత్తనం. ఇవి సాధారణంగా ప్రభుత్వంలి గుర్తించిన విత్తన ధ్రువీకరణ సంస్థల ధ్రువీకరణ లేకుండా ఉత్పత్తి చేయబడతాయి.

### నకిలీ విత్తనాలను గుర్తించడం ఎలా?

నకిలీ విత్తనాలను రెండు రకాలుగా గుర్తించవచ్చు ఒకటి పంట వేయకముందు రెండోది పంట వేసిన తర్వాత. ఒకవేళ పంట వేయకముందు రైతు నకిలి విత్తనాలను గుర్తించి అవగాహన కలిగి ఉన్నట్లయితే ఆర్థికంగా నష్టపోకుండా ఉండవచ్చు. అదేవిధంగా పంట వేసిన తర్వాత గుర్తిస్తే ఆర్థికంగా అధికంగా నష్టపోవాల్సి ఉంటుంది. కాబట్టి రైతులు విత్తనం వేసే ముందే ఈ విత్తనాలు నకిలీవా లేదా నిజమైన విత్తనాల అని తేడాలు గుర్తించి పరీక్షించుకొని విత్తనం నాటుకోవాలి.

### విత్తనం వేయక ముందు నకిలీ విత్తనాలు గుర్తించడం ఎలా? రైతులకి మార్గదర్శక సూచనలు

వ్యవసాయ ఉత్పత్తిలో విత్తనాల పాత్ర ఎంతో కీలకం. కానీ మార్కెట్లో నకిలీ విత్తనాల చలామణి రైతుల నమ్మకాన్ని నాశనం చేస్తోంది. ఈ నేపథ్యంలో ప్రతి రైతు తన భూమిలో విత్తనం వేయక ముందు కొన్ని ముఖ్యమైన అంశాలను పరిశీలించడం అవసరం.

### అనుమతులు కలిగిన డీలర్ల నుంచే విత్తనాలు కొనండి

ప్రభుత్వం ద్వారా గుర్తింపు పొందిన లేదా లైసెన్స్ కలిగిన డీలర్ల దగ్గర మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి. అక్రమ వ్యాపారులకు దూరంగా ఉండాలి.

### ధృవీకరించబడిన కంపెనీల విత్తనాలకే మొగ్గు చూపండి

విత్తన ధృవీకరణ సంస్థల నుండి లైసెన్సు పొందిన కంపెనీల విత్తనాలనే కొనాలి. ప్యాకెట్‌పై "హోలోగ్రామ్" ఉందో లేదో తప్పనిసరిగా పరిశీలించాలి.

### తక్కువ ధర -- అధిక నష్టం!

మొత్తం పెట్టుబడి ఆదా చేస్తుందని తక్కువ ధరలో అమ్మే మూటలపై మోసపోవద్దు. సాధారణంగా నకిలీ విత్తనాలు చాలా తక్కువ ధరకే అమ్ముతారు.

### బిల్లు తప్పనిసరి!

విత్తనాలు కొనుగోలు చేసిన వెంటనే రసీదు తీసుకోవాలి. సమస్య ఏర్పడితే ఇది న్యాయంగా నిదర్శనంగా ఉపయోగపడుతుంది.

### ప్యాకెట్ వెనక ట్యాగ్ లేదా స్టిక్కర్‌ను చూసి గుర్తించండి

ప్రైవేట్ కంపెనీల విత్తన సంచుల వెనుక భాగంలో ఉండే "పచ్చ రంగు ట్యాగ్" ( ట్రూత్ ఫుల్ లేబుల్డ్ ) లేదా "నీలి ట్యాగ్" (సర్టిఫైడ్ సీడ్) ఆధారంగా విత్తనాన్ని గుర్తించండి. మిరప, ప్రత్తి విత్తనాలపై ముఖ్యంగా పచ్చ ట్యాగ్ ఉండేలా చూస్తారు.

### ట్యాగ్‌పై లైసెన్స్, లాట్ నెంబర్, క్యూ ర్ కోడ్ వుంటేనే నమ్మకం

విత్తన ట్యాగ్ పై కంపెనీ లైసెన్స్ నెంబర్, లాట్ నెంబర్, క్యూ ర్ కోడ్, ప్యాకింగ్ తేదీ మరియు చెల్లుబాటు గల తేదీలు ముద్రించబడి ఉండాలి. ఇవి లేనివాటిని కొనొద్దు.

### మొలక శాతం, జన్యు శాతం వంటి ప్రమాణాలు తప్పక చూడాలి

ప్రతి విత్తన సంచిలో మొలక శాతం 80% కంటే ఎక్కువ, జన్యు శాతం 98% కంటే ఎక్కువ, ఇతర పదార్థాలు 2% కన్నా తక్కువగా ఉండాలి. ప్యాకెట్‌పై ఇవి ముద్రించి ఉండాలి.

### బీటీ విత్తనాల గుర్తింపు -- జి ఈ ఏ సి నంబర్ తప్పనిసరి

ప్రత్తి విత్తనాల విషయంలో జి ఈ ఏ సి (జెనెటిక్ ఇంజనీరింగ్ అప్రైసల్ కమిటీ) ద్వారా మంజూరైన నంబర్ ఉన్న విత్తనాలకే మొగ్గు చూపాలి. ఇది బీటీ విత్తనం అని గుర్తించేందుకు ప్రధాన ఆధారం.

ఈ సూచనలు పాటిస్తే రైతులు నకిలీ విత్తనాల వలలో పడకుండా, నమ్మకమైన విత్తనాలతో మంచి దిగుబడులు సాధించవచ్చు. ఎప్పుడూ మోసపోతే ముద్రాపత్రాలద్వారా న్యాయపరంగా ఫిర్యాదు చేయడాన్ని కూడా రైతులు మర్చిపోకూడదు.

### పంట కాలంలో నకిలీ విత్తనాలను గుర్తించే సూచనలు:

విత్తనాలు మొలకెత్తకపోవడం -- నాణ్యమైన విత్తనాలు సగటున 80-90% మొలకెత్తుతాయి. తక్కువ మొలకశాతం నకిలీ విత్తన సంకేతం కావచ్చు.

చెడ్డ మొలకలు -- మొలకెత్తిన విత్తనాలు సరైన ఎదుగుదల కనబరచకపోవడం.

పూత రాకపోవడం లేదా పూత పూసి రాలిపోవడం -- చివరికి కాయలుగా మారకపోవడం.

ఇలాంటి లక్షణాలు పంట సమయంలో గమనిస్తే వెంటనే వ్యవసాయ అధికారులకు తెలియజేయాలి.

రైతులు నకిలీ విత్తనాలు ఎందుకు కొనుగోలు చేస్తున్నారు?

### తక్కువ ధరకు లభ్యత

ఉచిత విత్తన బహుమతుల వంచనలు -- "మూడు కొనుగోలు చేస్తే ఒకటి ఉచితం" వంటి లౌకిక మాయాజాలాలు.

సరిగ్గా తెలుసుకోకుండానే ఎంపిక -- విత్తనాల విషయంలో అవగాహన లోపం.

### పెట్టుబడి తగ్గించుకోవాలనే ఉద్దేశం

ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యం -- నకిలీ విత్తన వ్యాపారాలపై తగిన చర్యల లోపం.

### బిటి (టీ) మరియు నాన్ బిటి ప్రత్తి విత్తనాలను గుర్తించడం ఎలా?

బిటి ప్రత్తి విత్తనాల్లో జన్యుపరమైన మార్పులతో పురుగు నిరోధకత కలిగి ఉండటం వల్ల ఎక్కువ దిగుబడులు వస్తాయి. అయితే మార్కెట్లో బిటి పేరిట నాన్ బిటి విత్తనాలు కల్తీగా అమ్ముతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి.

### గుర్తింపు కోసం:

"బి టి క్రై 1 ఏ బి/ క్రై 1ఏ సి రాపిడ్ డిటెక్షన్ కిట్స్ అనే స్ట్రిప్ కిట్లు రైతులకు అందుబాటులో ఉన్నాయి.

రెండు గీతలు వస్తే -- బిటి విత్తనం

ఒక గీత మాత్రమే వస్తే -- నాన్ బిటి విత్తనం ఇలా 30 నిమిషాల్లోనే రైతులు తామే పరీక్షించగలుగుతారు.

### విత్తన మొలక శాతం పరీక్షించే సరళమైన పద్ధతులు

విత్తనం నాణ్యత తెలుసుకోవాలంటే మొలకశాతం పరీక్ష అవసరం. రైతులు ఈ క్రింది పద్ధతుల్లో ఈ పరీక్షలు జరుపవచ్చు:

### ట్రే పద్ధతి

ఒక ప్లాస్టిక్ ట్రేలో శుభ్రమైన ఇసుక వేయాలి100 విత్తనాలను వరుసగా వేయాలి (ప్రతీ వరుసకు 10 చొప్పున)నీరు జల్లుతూ 7--10 రోజుల పాటు చూడాలి

ఎన్ని విత్తనాలు మొలకెత్తాయో లెక్కకట్టి మొలక శాతం తెలుసుకోవాలి, 80% కంటే తక్కువ మొలక శాతం వస్తే:

విత్తన మోతాదును పెంచాలి లేదా వేరే కంపెనీ విత్తనాలు తీసుకోవాలి.

రైతులు పై సూచనలు పాటిస్తే కొంత వరకు అన్నా నకిలీ విత్తనాల బారిన పడకుండా అధిక దిగుబడులు పొందవచ్చు.

"నకిలీ విత్తనాలను తిరస్కరిస్తేనే లినాణ్యమైన దిగుబడులు సాధ్యమవుతాయి

అవగాహననే ఆయుధం.. నాణ్యతే విజయానికి పునాది..

జి. అజయ్ కుమార్
వ్యవసాయ నిపుణులు



# శాంతి దిశగా అమెరికా... ఇరాన్ చారిత్రక అడుగు

(సి.హెచ్.ప్రతాప్)

**జూన్ 15, 2026 ప్రపంచ రాజకీయ చరిత్రలో ఒక ముఖ్యమైన రోజుగా నిలిచిపోయే అవకాశముంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌తో శాంతి ఒప్పందం కుదిరినట్లు అధికారికంగా ప్రకటించడంతో గత మూడు నెలలుగా ప్రపంచాన్ని ఆందోళనకు గురిచేసిన అమెరికా--ఇరాన్ ఉద్రిక్తతలకు తాత్కాలికంగా తెరపడింది. ఈ పరిణామం కేవలం రెండు దేశాలకే కాకుండా మొత్తం మధ్యప్రాచ్య ప్రాంతానికి, ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు, అంతర్జాతీయ భద్రతకు కూడా ఎంతో ప్రాధాన్యం సంతరించుకుంది.**



ఫిబ్రవరి 28, 2026న ప్రారంభమైన ఘర్షణ జూన్ 15 వరకు దాదాపు మూడు నెలలకుపైగా కొనసాగింది. అయితే ఈ వివాదానికి మూలాలు చాలా లోతైనవి. 1979లో జరిగిన ఇరాన్ ఇస్లామిక్ విప్లవం తరువాత అమెరికా--ఇరాన్ సంబంధాలు క్షీణించాయి. అణు కార్యక్రమం, ఆర్థిక ఆంక్షలు, మధ్యప్రాచ్య రాజకీయాలు, ప్రాంతీయ ప్రభావం వంటి అంశాలపై ఇరు దేశాల మధ్య నాలుగు దశాబ్దాలకు పైగా విభేదాలు కొనసాగాయి. ఈ నేపథ్యంలో 2026లో ఉద్రిక్తతలు ఘర్షణ స్థాయికి చేరుకోవడంతో ప్రపంచ దేశాలు ఆందోళన వ్యక్తం చేశాయి.

ఈ శాంతి ప్రక్రియలో పాకిస్థాన్ మధ్యవర్తిత్వం కీలక పాత్ర పోషించింది. ఇరు దేశాల మధ్య జరిగిన సంప్రదింపులు చివరకు అవగాహన ఒప్పందానికి దారితీశాయి. స్విట్జర్లాండ్‌లో జరగనున్న తదుపరి చర్చలు ఈ ప్రక్రియకు మరింత బలం చేకూర్చనున్నాయి. ఒప్పందం అమలుకు 60 రోజుల చర్చల కాలాన్ని నిర్ణయించడం ద్వారా ఇరు పక్షాలు పరస్పర విశ్వాసాన్ని పెంపొందించుకునే అవకాశాన్ని కల్పించాయి.

ఇరాన్ ఈ ఒప్పందానికి మూడు ప్రధాన షరతులను ముందుంచింది. అమెరికా సైనిక చర్యలను పూర్తిగా నిలిపివేయడం, హోర్ముజ్ జలసంధిపై ఉన్న పరిమితులను ఎత్తివేయడం, అలాగే ఇరాన్‌కు చెందిన స్తంభింపజేసిన ఆర్థిక ఆస్తులను విడుదల చేయడం వాటిలో ప్రధానమైనవి. మరోవైపు అమెరికా ఇరాన్ అణు కార్యక్రమంపై నియంత్రణ, అధికంగా శుద్ధి చేసిన యురేనియం నిల్వల తగ్గింపు, ప్రాంతీయ భద్రతా హామీలపై దృష్టి సారించింది.

ఈ ఒప్పందంలోని అత్యంత కీలక అంశం హోర్ముజ్ జలసంధి పునఃప్రారంభం. ప్రపంచ చమురు రవాణాలో కీలకమైన ఈ జలసంధి ద్వారా ప్రపంచ ఇంధన సరఫరాలో గణనీయమైన భాగం రవాణా అవుతుంది. ఈ మార్గం తిరిగి తెరవబడడం వల్ల చమురు మార్కెట్లలో స్థిరత్వం నెలకొనే అవకాశం ఉంది. అంతర్జాతీయ వాణిజ్యం, సముద్ర రవాణా రంగాలకు కూడా ఇది ఊరటనిచ్చే పరిణామం.

అయితే ఈ ఒప్పందం కుదిరినంత మాత్రాన ఇరు దేశాల మధ్య పూర్తి విశ్వాసం ఏర్పడిందని భావించడం సరైంది కాదు. ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధులు కూడా అమెరికా తన హామీలను ఎలా అమలు చేస్తుందో నిశితంగా గమనిస్తామని స్పష్టం చేశారు. అంటే ఈ ఒప్పందం విజయవంతం కావడం పూర్తిగా అమలు ప్రక్రియపై ఆధారపడి ఉంటుంది.

ప్రపంచ దేశాలు ఈ పరిణామాన్ని స్వాగతిస్తున్నాయి. యుద్ధం కంటే దౌత్యమే శాశ్వత పరిష్కారానికి మార్గమని ఈ ఒప్పందం మరోసారి నిరూపించింది. మధ్యప్రాచ్యంలో స్థిరత్వం నెలకొంటే ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు, ఇంధన భద్రతకు, అంతర్జాతీయ వాణిజ్యానికి గణనీయమైన ప్రయోజనం కలుగుతుంది.

అమెరికా--ఇరాన్ శాంతి ఒప్పందం ఇంకా ప్రారంభ దశలో ఉన్నప్పటికీ, 47 సంవత్సరాల అవిశ్వాసం మరియు ఘర్షణల తర్వాత సంభాషణకు అవకాశం కల్పించడం ఒక సానుకూల పరిణామం. ఇరు దేశాలు తమ కట్టుబాట్లను నిజాయితీగా అమలు చేస్తే, ఇది కేవలం యుద్ధానికి ముగింపు మాత్రమే కాకుండా మధ్యప్రాచ్యంలో శాంతి, సహకారం, అభివృద్ధికి కొత్త అధ్యాయానికి నాంది కావచ్చు..

## నాన్న.... మనిషితనపు నిలువుటద్దం

మనిషిలోని మానవత్వ వెలుగు నాన్న
మరుగునున్న మమతల తలపు నాన్న.

తన కలలను కాలగర్భంలో దాచిపెట్టి
పిల్లల కలల పంటపండే గెలుపు నాన్న.

బాట మధ్యలో తుఫానులు ఎదురైనా
భయపడకు అని నిలబెట్టే మలుపు నాన్న.

ధనం వచ్చి పోయేదని తెలిసి
ధర్మమొక్కటే మిగిలే అనే పిలుపు నాన్న.

ఎత్తులెన్ని చేరినా వంగి ఉండమంటూ
ఫలభారంతో వంగిన చెట్టు విలువు నాన్న.

చెమట చుక్కను భూమికి ఇచ్చిన
రేపటి ఆశల పంట నాన్న.

స్వార్థమే విజయమని లోకం పలికినా
సేవలోనే సార్థకత అన్న నాన్న.

ఓటమిని శాపమని చింతించక
గెలుపుకు తొలి మలుపు అని పలుకు నాన్న.

దేవుడెక్కడ అని అడగక
దీనుడి కన్నీరు తుడవమనే పిలుపు నాన్న.

మాటలకంటే నడవడిక గొప్పదనుచెప్పి
జీవితానికే పాఠమయ్యే గురువు నాన్న.

ఇల్లు కట్టడం గొప్పకాదు, హృదయం కట్టమని
కుటుంబాలను కలిపి ఉంచే కలపు నాన్న.

కాలప్రవాహంలో శరీరం కరిగినా
విలువల రూపంలో నిలిచిన వెలుగు నాన్న.

అక్షర విశ్వమందు విశ్వసత్యమై,
మనిషి మిగిలే మార్గపు తలపు నాన్న.

డాక్టర్ విశ్వేశ్వరరావు కొణపల
రిటైర్డ్ అసోసియేట్ ప్రొఫెసర్ 9640687608

# యోగాతో ఆరోగ్యమే మహాభాగ్యం

### కోటిలింగాల ఘాట్‌లో ఘనంగా 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం

**రాజమహేంద్రవరం, జయజయహే బ్యూరో:**

యోగా ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమని రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి అన్నారు. 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆదివారం కోటిలింగాల ఘాట్‌లో ఆయుష్ శాఖ, రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్, జిల్లా యంత్రాంగం సంయుక్తంగా నిర్వహించిన 'యోగాంధ్ర' కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని యోగాసనాలు చేశారు. ఈ సందర్భంగా పురంధేశ్వరి మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతిపాదనతో ఐక్యరాజ్యసమితి జూన్ 21ను అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించిందని గుర్తు చేశారు. భారతీయ సంస్కృతికి ప్రతీకైన యోగా ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్యకరమైన జీవనశైలికి మార్గదర్శకంగా నిలుస్తోందన్నారు. జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ యోగా సర్వరోగ నివారిణిగా పనిచేస్తుందని, ప్రతిరోజూ 45 నిమిషాల యోగా సాధన శారీరక, మానసిక





ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందని తెలిపారు. ప్రాణాయామం, ధ్యానం ద్వారా ఒత్తిడి, ఆందోళన తగ్గి ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతాయని చెప్పారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ యోగా ద్వారా ప్రపంచ దేశాలు భారతదేశాన్ని విశ్వగురువుగా గుర్తించాయని పేర్కొన్నారు. అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ విద్యార్థుల్లో మానసిక స్థైర్యం, ఏకాగ్రత పెంపొందించడంలో యోగాభ్యాసం కీలకమన్నారు. కార్యక్రమంలో సృష్టి క్రమ, శిక్షణ క్రమ, రక్షణ క్రమ, ఆధ్యాత్మిక క్రమ, చికిత్స క్రమ అనే ఐదు రకాల యోగా విధానాలను యోగా గురువు పరియా రామచంద్రరావు ఆధ్వర్యంలో ప్రదర్శించారు. అనంతరం బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు ధ్యాన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచిన చిన్నారులు, యోగా గురువులను అతిథులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్, మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, యోగా సాధకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం శాంతి జపంతో ప్రారంభమై యోగా సంకల్పంతో ముగిసింది

# యోగాతో ఆరోగ్యం.. ఆనందమయ జీవితం

### జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

**ముంచంగిపుట్టు, (జయ జయహే)**





నేటి ఉరుకులు పరుగుల జీవితంలో మానసిక ఒత్తిడిని దూరం చేసి శరీరాన్ని దృఢంగా ఉంచే అద్భుత సాధనం యోగ అని ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు క్రీడా మైదానంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన "యోగాంధ్ర" కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా 108 సూర్య నమస్కారాలతో కూడిన యోగాసనాలు నిర్వహించిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ, యోగ కేవలం ఒక వ్యాయామం మాత్రమే కాదని, అది మనసును, శరీరాన్ని ప్రకృతితో అనుసంధానం చేసే జీవన విధానమని పేర్కొన్నారు. యోగ మనల్ని మనం తెలుసుకునే అంతర్గత ప్రయాణమని, శరీరానికి ఆరోగ్యం, మనసుకు ప్రశాంతత, ఆత్మకు నిశ్శబ్దాన్ని ప్రసాదించే ఏకైక ఔషధమని తెలిపారు. యోగ అన్ని మతాల కంటే పురాతనమైనదని, మతం అనే ఆలోచన ఏర్పడక ముందే యోగ మన జీవన విధానంలో భాగంగా ఉండేదన్నారు. యోగకు దూరం కావడం వల్లే నేడు అనేక వ్యాధులు, మానసిక ఒత్తిడులు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. యోగ సాధన ద్వారా శక్తి, ఎరుక, అస్తిత్వం పెరుగుతాయని, గతాన్ని మార్చలేకపోయినా దాని ప్రభావాన్ని అధిగమించేందుకు యోగ గొప్ప మార్గమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అరిసెల సీతమ్మ, ఎంపీటీసీ సుబ్బలక్ష్మి, జోలపుట్టు ఎంపీటీసీ కమల, పెదపాడు ఎంపీటీసీ గణపతి, బరడ ఎంపీటీసీ నబ్బో, లక్ష్మీపురం ఎంపీటీసీ సాధురామ్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పాంగి పద్మారావు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ అరబీరు జగబంధు, వివిధ పంచాయతీల సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, ప్రజలు, యోగా ప్రేమికులు, అధికారులు పాల్గొన్నారు.

# జిజిహెచ్ అభివృద్ధికి ప్రాధాన్యత

### మంత్రి సత్య కుమార్ యాదవ్‌తో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ భేటీ

**రాజమహేంద్రవరం:జయ జయహే:జూన్ 21:**





నగరంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ని సర్వహంగులతో అభివృద్ధి చేసి, ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలను అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ స్పష్టం చేశారు. ఒక ప్రైవేట్ ఆసుపత్రి ప్రారంభోత్సవ కార్యక్రమం కోసం నగరానికి విచ్చేసిన మంత్రిని, స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహంలో రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు)మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, జీజీహెచ్‌లో ప్రస్తుతం ఉన్న పరిస్థితులపై మంత్రికి వివరించారు. ముఖ్యంగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా రోగుల తాకిడి ఎక్కువగా ఉన్న దృష్ట్యా, ఆసుపత్రిని ఆధునీకరించాల్సిన అవసరాన్ని ఆయన చెప్పారు. చర్చల్లో భాగంగా ప్రధానంగా కింది అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పెరుగుతున్న రోగుల సంఖ్యకు అనుగుణంగా అదనపు వైద్యులు, నర్సింగ్ మరియు పారామెడికల్ సిబ్బందిని నియమించడం. ఆసుపత్రి భవనాల ఆధునీకరణ, అత్యవసర సేవల విస్తరణ మరియు రోగులకు మెరుగైన వసతుల కల్పన. ఆధునిక నిర్ధారణ (డయాగ్నస్టిక్) పరికరాలు అత్యాధునిక వైద్య పరికరాల అందుబాటు. ఆసుపత్రిలోని వివిధ ప్రత్యేక వైద్య విభాగాలను మరింత బలోపేతం చేయడం. ఆసుపత్రి ఆవరణలో పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపరచడం. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ విజ్ఞప్తిపై స్పందించిన మంత్రి సత్య కుమార్ యాదవ్, రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి అత్యంత ప్రాధాన్యతనిస్తుందని తెలిపారు. రాజమహేంద్రవరం జిజిహెచ్‌ను ఆదర్శవంతమైన ఆసుపత్రిగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని, ఆసుపత్రి అభివృద్ధికి ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ భేటీలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

# ఎన్‌సీబీ గంజాయిపై ఉక్కుపాదం

### 1125 కిలోల గంజాయి పట్టివేత

### విలువ రూ.5 కోట్ల 62 లక్షల 50 వేలు

### ముగ్గురు స్మగ్లర్లు అరెస్ట్ .. రవాణాకు ఉపయోగించిన బొలెరో వాహనం స్వాధీనం

**ముంచంగిపుట్టు, జయ జయహే**





మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ) అధికారులు మరోసారి తమ ఉక్కుపాదాన్ని మోపారు. విశ్వసనీయ సమాచారం ఆధారంగా నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్‌లో 1125 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని, ముగ్గురు స్మగ్లర్లను అరెస్ట్ చేశారు. ఎన్‌సీబీ విశాఖపట్నం జోనల్ యూనిట్ అధికారులు ముంచంగిపుట్టు మండలం పనస గ్రామ సమీపంలో నిఘా ఏర్పాటు చేసి వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో ఒడిశా నుంచి అక్రమంగా తరలిస్తున్న గంజాయిని గుర్తించి పట్టుకున్నారు. గంజాయిని తాడుబస్తాల్లో నింపి రవాణా చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ కేసులో పనస గ్రామానికి చెందిన వంతల గోపాల్, కిల్లో అనంతరాం, అలాగే ఒడిశా రాష్ట్రానికి చెందిన మరో వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. గంజాయి రవాణాకు ఉపయోగించిన మహీంద్రా బొలెరో మ్యాక్స్ పికప్ వాహనాన్ని సీజ్ చేశారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.5 నుంచి రూ.6 కోట్ల వరకు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. నిందితులపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. గంజాయి అక్రమ రవాణాపై ఎన్‌సీబీ అధికారులు నిరంతరం నిఘా కొనసాగిస్తున్నారని, మాదకద్రవ్యాల నిర్మూలనకు కట్టుబడి పనిచేస్తున్నామని తెలిపారు. ఈ భారీ పట్టివేతతో అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లింగ్ ముఠాలకు గట్టి హెచ్చరిక వెళ్లిందని పేర్కొన్నారు



# రక్తదాతలే నిజమైన ప్రాణదాతలు.... రక్తదానం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలి

### ఉమ్మడి విశాఖ జిల్లా జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర

### ముంచంగిపుట్టు సి.హెచ్.సి లో రక్తదాన శిబిరం

**ముంచంగిపుట్టు, జయ జయహే**



రక్తదాతలే నిజమైన ప్రాణదాతలు అని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తం దానం చేసేందుకు ముందుకు రావాలని ఉమ్మడి విశాఖ జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఆదివారం ముంచంగిపుట్టు సామాజిక ఆరోగ్య కేంద్రం (సిహెచ్ సీ )లో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆమె ప్రారంభించి, స్వయంగా రక్తదానం చేశారు. అనంతరం రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేసిన సుభద్ర మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో రక్తం అందక అనేక మంది ప్రాణాలు కోల్పోయిన ఘటనలను తాను ప్రత్యక్షంగా చూశానని తెలిపారు. రక్తదానంపై అవగాహన లేకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడుతోందని, గ్రామ గ్రామాన చైతన్య కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా సికిల్ సెల్ అనీమియాతో బాధపడుతున్న గిరిజనులకు తరచూ రక్తం అవసరమవుతుందని, వారి ప్రాణాలను కాపాడేందుకు యువత స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. రక్తదానం మహాదానమని, ఒకరి రక్తం మరొకరికి జీవదానంగా మారుతుందని పేర్కొన్నారు. ఈ శిబిరంలో పెద్ద సంఖ్యలో ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, యువత, అధికారులు పాల్గొని రక్తదానం చేశారు. రక్తదాతల సేవాభావాన్ని జడ్పీ చైర్‌పర్సన్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అరిసెల సీతమ్మ, ఎంపీటీసీ సుబ్బలక్ష్మి, జోలపుట్టు ఎంపీటీసీ కమల, పెదపాడు ఎంపిటిసి గణపతి, బరడ ఎంపిటిసి నబ్బో , లక్ష్మీపురం ఎంపీటీసీ సాధురామ్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పాంగి పద్మారావు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జెసిఎస్ జిల్లా కోఆర్డినేటర్ అరబీరు జగబంధు, వివిధ పంచాయతీల సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు విద్యార్థులు, ప్రజలు , యోగ ప్రేమికులు, అధికారులు పాల్గొన్నారు.



# గోదావరి జల కాలుష్యంపై పేపర్ మిల్లుపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి

### పవన్ కళ్యాణ్ సహా అధికారుల సాక్ష్యాలు నమోదు చేయాలి: రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్.. రాజమండ్రి 3వ పట్టణ పోలీస్ స్టేషన్‌లో మేడా శ్రీనివాస్ ఫిర్యాదు

**రాజమహేంద్రవరం :జయ జయహే జూన్ 21:**

గోదావరి జలాలు, వాయు కాలుష్యానికి కారణమవుతున్న పేపర్ మిల్లు యాజమాన్యంపై, అలాగే బాధ్యులైన అధికారులపై చట్టపరమైన మరియు శాఖాపరమైన చర్యలు చేపట్టాలని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మేడా శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం రాజమండ్రి 3వ పట్టణ పోలీస్ స్టేషన్‌లో లిఖితపూర్వక ఫిర్యాదు సమర్పించినట్లు పార్టీ సీనియర్ సెక్యులర్ పెండ్యాల కామరాజు తెలిపారు. మేడా శ్రీనివాస్ మాట్లాడుతూ, రాజమండ్రి అర్బన్ పరిధిలో సుమారు 8 లక్షల మంది ప్రజల ఆరోగ్యాన్ని పేపర్ మిల్లు కార్యకలాపాలు తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయని ఆరోపించారు. గోదావరిలో ప్రమాదకర రసాయన వ్యర్థాలు విడుదల చేయడం వల్ల నీటి కాలుష్యం పెరిగి ప్రజలు అనేక రకాల ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి గోదావరి జలాలు, వాయు కాలుష్యంపై అధికారులను వివరణ కోరిన సందర్భంలో వాస్తవాలను దాచిపెట్టి తప్పుదారి పట్టించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. కాలుష్య నియంత్రణ మండలి, రాజమండ్రి నగర పాలక సంస్థ అధికారులు మిల్లు యాజమాన్యానికి అనుకూలంగా వ్యవహరించారని విమర్శించారు. గోదావరిలో కలుస్తున్న రసాయన వ్యర్థాలపై శాస్త్రీయ పరీక్షల్లో ప్రమాదకర స్థాయిలో కాలుష్యం ఉన్నట్లు తేలిందని, దీనిపై ప్రభుత్వ నివేదికలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు. కాలుష్యం కారణంగా కంటి వ్యాధులు, చర్మ సమస్యలు, జుట్టు రాలిపోవడం, శ్వాసకోశ వ్యాధులు, ఉబ్బసం, మహిళల్లో ఆరోగ్య సమస్యలు, రోగనిరోధక శక్తి తగ్గడం వంటి సమస్యలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. అలాగే వ్యవసాయ భూములు, పంటలు, పశుసంపదపై కూడా తీవ్ర ప్రభావం పడుతోందన్నారు. 2027 గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని భక్తుల మనోభావాలు, ప్రజల ఆరోగ్య రక్షణ కోసం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫిర్యాదులో నీటి కాలుష్య నివారణ చట్టం-1974, పర్యావరణ సంరక్షణ చట్టం-1986, వాయు కాలుష్య నియంత్రణ చట్టం-1981, భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని సంబంధిత సెక్షన్ల ప్రకారం మిల్లు యాజమాన్యం మరియు బాధ్యులైన అధికారులపై కేసులు నమోదు చేయాలని కోరారు. ఆర్‌పిసి ప్రధాన కార్యాలయం నుంచి భారీ ర్యాలీగా బయలుదేరిన పార్టీ శ్రేణులు "గోదావరి జలాలను రక్షించాలి", "పేపర్ మిల్లుపై చర్యలు తీసుకోవాలి", "ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరు అందించాలి", "పుష్కరాలకు ముందు మిల్లును మూసివేయాలి" వంటి నినాదాలు చేస్తూ 3వ పట్టణ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పీసీ నాయకులు, కార్యకర్తలు పెండ్యాల కామరాజు, డి.వి. రమణమూర్తి, లంక దుర్గాప్రసాద్, దుద్దే సురేష్, గుడ్ల సాయి దుర్గాప్రసాద్, వర్ధనపు శరత్ కుమార్, మేడా చిన్నారి, కొల్లి సత్యనారాయణ, పాండ్రంకి ఈశ్వరరావు, యేడిద బాబులు, పసుపులేటి వీర్రాజు, మాసా లక్ష్మి, బోడపాటి సువర్ణ వేణు, పసుపులేటి సుశీల, పద్మనాభం ధనస్సు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

For a pure tomorrow..

# దక్షిణ కోస్తా రైల్వే ఆధ్వర్యంలో యోగా దినోత్సవం





**- జోన్ ఏర్పాటయ్యాక తొలి కార్యక్రమం కావడంతో ప్రాధాన్యత**

**- పాల్గొన్న జీఎం మాధుర్ దంపతులు...అన్ని విభాగాల అధిపతులు**

**విశాఖపట్నం, జూన్ 21, జయ జయహే**

దక్షిణ కోస్తా రైల్వే ఆధ్వర్యంలో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం ఆదివారం విశాఖలో ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. నూతనంగా ఏర్పాటైన దక్షిణ కోస్తా రైల్వే జోన్‌లో జరుపుకున్న తొలి అంతర్జాతీయ యోగా దినోత్సవం కావడంతో ఈ కార్యక్రమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఏర్పడింది. జోన్ పరిధిలోని అన్ని శాఖలు, యూనిట్లకు చెందిన ఉద్యోగులు ఈ వేడుకలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి దక్షిణ కోస్తా రైల్వే జనరల్ మేనేజర్ సందీప్ మాథుర్, దక్షిణ కోస్తా రైల్వే మహిళా సంక్షేమ సంస్థ (ఎస్‌సీఓఆర్‌డబ్ల్యూవో) అధ్యక్షురాలు చారు మాథుర్ నాయకత్వం వహించారు. ప్రధాన శాఖాధిపతులు, అధికారులు, ఎస్‌సీఓఆర్‌డబ్ల్యూవో సభ్యులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు, స్కౌట్స్ అండ్ గైడ్స్ కేడెట్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ సందీప్ మాథుర్ మాట్లాడుతూ 2026 అంతర్జాతీయ యోగా దినోత్సవం యొక్క ప్రధాన అంశమైన "ఆరోగ్యకర వృద్ధాప్యం కోసం యోగా" గురించి ప్రస్తావిస్తూ, యోగా అనేది కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాకుండా శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత, భావోద్వేగ సమతుల్యత మరియు ఆరోగ్యకరమైన దీర్ఘాయుష్షును పెంపొందించే జీవన విధానమని వివరించారు. దేశసేవలో నిరంతరం విధులు నిర్వర్తించే రైల్వే కుటుంబానికి యోగా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు భావోద్వేగ స్థైర్యాన్ని పెంపొందించే శక్తివంతమైన సాధనమని, తద్వారా మరింత సురక్షితమైన, సమర్థవంతమైన మరియు ఉత్పాదక రైల్వే కార్యకలాపాలకు దోహదపడుతుందని తెలిపారు. గత సంవత్సరం విశాఖపట్నంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమక్షంలో జరిగిన అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో భారత్ గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించడం దేశానికి గర్వకారణమని మాథుర్ గుర్తు చేశారు. ఆ చారిత్రాత్మక విజయంతో స్ఫూర్తి పొందిన భారత్ మరిన్ని ఉన్నత విజయాలను సాధిస్తూ, యోగా మరియు సమగ్ర ఆరోగ్యానికి ప్రపంచ రాయబారిగా తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకుంటుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఉద్యోగులు తమ దైనందిన జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని సూచిస్తూ, కార్యాలయ సమయంలో ఆరోగ్యాన్ని పెంపొందించేందుకు ఉద్యోగుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన సరళమైన యోగా సాధనలతో కూడిన "5 నిమిషాల వై-బ్రేక్ ప్రోటోకాల" ను అవలంబించాలని మాథుర్ పిలుపునిచ్చారు. సమాజం భావితరాల శ్రేయస్సు కోసం "ఆరోగ్యకర వృద్ధాప్యం కోసం యోగా" సందేశాన్ని ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని కోరారు. యోగాను జీవన విధానంగా స్వీకరించి, ఆరోగ్యవంతమైన, ఆనందకరమైన మరియు శక్తివంతమైన భారతదేశ నిర్మాణానికి కలిసికట్టుగా కృషి చేయాలనే సామూహిక ప్రతిజ్ఞ చేశారు. విశాఖ డీఆర్ఎం బొహ్రా తదితరులు పాల్గొన్నారు.

# యువత యోగాను నిత్యజీవితంలో భాగం చేసుకోవాలి






## అన్నుమన్ ప్రసాద్ దాస్

**గుంటూరు,జూన్ 21జయ జయహే**

యువత యోగానును నిత్య జీవితంలో భాగస్వామ్యం చేసుకోవాలని,మానసిక ప్రశాంతతకు యోగా ఉత్తమ సాధనం అని మేరా యువ భారత్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం యానాం రాష్ట్ర సంచాలకులు అన్నుమన్ ప్రసాద్ దాస్ అన్నారు.గుంటూరు జిల్లా గోరంట్ల గ్రామంలోని వేదవ్యాస భవన్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను మేరా యువ భారత్ ,గుంటూరు,శ్రీ చైతన్య గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సంయుక్త ఆద్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అన్నుమన్ ప్రసాద్ దాస్ హాజరై యోగా యొక్క ప్రాముఖ్యతను వివరించారు. నేటి వేగవంతమైన జీవనశైలిలో శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి యోగా ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. యువత ప్రతిరోజూ యోగా సాధన చేయడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తోడ్పడాలని సూచించారు.కార్యక్రమంలో అతిథులుగా కిరణ్మయి దేవిరెడ్డి, డిప్యూటీ డైరెక్టర్, మేరా యువ భారత్ , గుంటూరు,దుర్గాప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ఏజీఎం,శ్రీ చైతన్య గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్,జి. ఆంజనేయులు,డీన్,పి. శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్,రాఘవేంద్రరావు, ప్రిన్సిపాల్, టి. వినోద్ కృష్ణ, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్, పి.శృతి,యోగా ఇన్‌స్ట్రక్టర్ పాల్గొన్నారు.యోగా ఇన్‌స్ట్రక్టర్ పి.శృతి ఆధ్వర్యంలో విద్యార్థులు, యువత,అధ్యాపకులు వివిధ యోగా ఆసనాలు, ప్రాణాయామాలు చేసి యోగా పట్ల తమ ఆసక్తిని చాటుకున్నారు.

# దుడ్డుపాలెంలో వైభవంగా 'శ్రీ వేంకటేశ్వర స్వామి వ్రతం'





**చోడవరం, జూన్ 21, జయ జయహే :**


తిరుమల తిరుపతి దేవస్థానం - హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లా చోడవరం సమీపంలోని దుడ్డుపాలెం గ్రామంలో ఆదివారం శ్రీ వేంకటేశ్వర స్వామి వ్రతం' అత్యంత వైభవంగా జరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో భక్తి భావాన్ని పెంపొందించే లక్ష్యంతో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ పవిత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వ్రతంలో చోడవరం, వి.మాడుగుల, బుచ్చయ్యపేట, రావికమతం తదితర మండలాల పరిధిలోని గ్రామీణ ప్రాంతాల నుంచి భక్తులు విశేషంగా పాల్గొన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన అర్చక స్వాములు స్వయంగా విచ్చేసి, వేద మంత్రోచ్ఛారణల నడుమ అత్యంత వైభవంగా ఈ వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ పవిత్ర కార్యక్రమానికి ముఖ్య దాతలుగా వ్యవహరించిన కొఠారి సునీత వారి బృందం వ్రతానికి అవసరమైన పూజా సామాగ్రితో పాటు, విచ్చేసిన భక్తులందరికీ అన్నప్రసాద వితరణ, ఇతర మౌలిక సదుపాయాలను భక్తిపూర్వకంగా సమకూర్చారు. కార్యక్రమం ప్రారంభంలో వర్షం అంతరాయం కల్గిస్తుందనుకుంటున్న తరుణంలో ఆకాశంలో గరుడపక్షి రాగా ఆనందంతో భక్తులు గోవింద నామ స్మరణం చేయగా వర్షం ఆగి నిరాటంకంగా వ్రతం పూర్తి చేసారు . ఇదంతా కలియుగ వైకుంఠుని మహాత్యంగా భక్తులు భావించారు. ఈ కార్యక్రమంలో స్థానిక విశ్రాంత ఉప కులపతి ముర్రు ముత్యాల నాయుడు హిందూ ధర్మ ప్రచార పరిషత్ కార్యదర్శి మేడసాని మోహన్‌కి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ ఇటువంటి కార్యక్రమాలు మరిన్ని చేయాలని తెలిపారు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ (విశాఖపట్నం క్లస్టర్) సిబ్బంది ఎం. కల్యాణ శ్రీరామ్, ప్రోగ్రాం అసిస్టెంట్ చల్లా సత్యనారాయణ, మానేపల్లి లక్ష్మి, విజయ, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.




# డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు

**చోడవరం జూన్ 21, జయ జయహే**

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకము, ఫిజికల్ ఎడ్యుకేషన్ వారి నిర్వహణలో "ఆదివారం అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము కళాశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు కళాశాలలోని అన్ని గ్రూపుల విద్యార్థులు అధ్యాపక బృందం పాల్గొని యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి కిరణ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక చోడవరం బ్రహ్మకుమారిస్ కృష్ణకుమారి, సౌజన్య ఆధ్వర్యంలో అధ్యాపక బృందానికి, విద్యార్థులకు యోగాసనాలు మానసిక ఒత్తిడి కార్యక్రమాలను గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ముఖ్యంగా విద్యార్థులు ప్రస్తుతం ఉన్న పరిస్థితులలో ఈ యోగా కార్యక్రమాలు అత్యవసరమని, దీని ద్వారా మానసిక ప్రశాంతత పొందడంతోపాటు, విజ్ఞానంపై దృష్టి పెట్టడానికి అవకాశం ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ సేవా విభాగం ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ రత్నభారతి, బి పిచ్చమ్మ,డి. మాల్యాద్రి, ఫిజికల్ ఎడ్యుకేషన్ అధ్యాపకులు డాక్టర్ వాసు దేవరాజు, సీనియర్ అధ్యాపకులు వీఅప్పలనాయుడు, డబ్ల్యూ ఈ సి సమన్వయకర్త డాక్టర్ లక్ష్మీ మంగమ్మ, డాక్టర్ మళ్ళీ బాబు, డాక్టర్ కృష్ణారావు, డాక్టర్ రాధాకృష్ణ, డాక్టర్ జ్యోతి, డాక్టర్ సూర్యవతి, డాక్టర్ సంధ్య శ్రీ, శ్రీ వెంకటేష్, సరస్వతి, డాక్టర్ సంతోష అధ్యాపక బృందం పాల్గొన్నారు.



# చోడవరంలో యోగ దినోత్సవ వేడుకలు

**చోడవరం జూన్ 21 జయ జయహే**

అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భంగా చోడవరం మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం యోగా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యోగ గురువు బలిరెడ్డి నారాయణరావు వివిధ రకాల యోగాసనాలు చేయించి వాటి విశిష్టతను ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా ఎండిఓ బివిఎస్ రాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ప్రతిరోజు రెండు పూటలా శ్రద్ధతో యోగాసనాలు వేసి ఉన్నాడు ఆరోగ్యం సిద్ధిస్తుందని తెలిపారు. యోగ ఆరోగ్యానికి దివ్య ఔషధమని చెబుతూ ప్రతి ఒక్కరు ఆ దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రధాని మోడీ చొరవతోనే నేటి ప్రపంచమంతా యోగా దినోత్సవం వేడుకలు జరుపుకుంటున్నారని ఆ ఘనత ఒక భారతదేశానికి చెల్లిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆయుష్ డాక్టర్ పద్మావతి, డిప్యూటీ ఎండిఓ అర్జున్ రావు, ఏవో షేక్ షిలార్, కార్యాలయ సిబ్బంది లావణ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



# మాడుగుల మోదకొండమ్మ అమ్మవారిని దర్శించుకున్న జిల్లా అదనపు జడ్జి

**మాడుగుల జూన్ 21 జయ జయహే**

ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం, మాడుగుల శ్రీ మోదకొండమ్మ అమ్మవారిని ఆదివారం విశాఖపట్నం 3వ అదనపు ఫ్యామిలీ కోర్ట్ 7వ అదనపు జిల్లా జడ్జి జె. శ్రీనివాస రావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ మర్యాదలతో జిల్లా అదనపు జడ్జికి స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు పుప్పాల అప్పలరాజు, స్థానిక న్యాయవాది శ్రీనాదు ప్రమోద్ కుమార్ ఆయన్ని సత్కరించారు.

# ఆటోలో ప్రయాణిస్తున్న మహిళా ప్రయాణికులనే టార్గెట్

## ఇద్దరు మహిళా దొంగల అరెస్ట్

**రాజమహేంద్రవరం: జయ జయహే:జూన్ 21:**

రాజానగరం ప్రజా రవాణా వాహనాల్లో ప్రయాణించే మహిళల బ్యాగులే లక్ష్యంగా దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు మహిళా నిందితులను రాజానగరం పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి సుమారు రూ. 4.85 లక్షల విలువైన 160 గ్రాముల బంగారు ఆభరణాలు, 180 గ్రాముల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు రాజానగరం స్టేషన్ హౌస్ ఆఫీసర్ వెల్లడించారు. భవానీపురం, కొంతమూరు గ్రామానికి చెందిన పసల బేబీ ఈనెల 13న కంబాలచెరువు నుండి మురారి గ్రామానికి ఆటోలో ప్రయాణిస్తున్నారు. దివాన్‌చెరువు వద్ద అదే ఆటోలో ఎక్కిన ఇద్దరు మహిళలు, ఆమెను మాటల్లో పెట్టి బ్యాగులో ఉన్న బంగారు, వెండి ఆభరణాలను అపహరించి పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు క్రైం నెం. 167/2026, సెక్షన్ 303(2) బీఎన్ఎస్ కింద పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కేసు దర్యాప్తు కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసిన పోలీసులు, సాంకేతిక ఆధారాలను విశ్లేషించి నిందితుల ఆచూకీని కనిపెట్టారు. ఈ క్రమంలో, జూన్ 21వ తేదీ ఉదయం కొంతమూరు గ్రామం వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, గోకవరం నుండి రాజమండ్రి వైపు వెళ్తున్న ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు పోలీసులను చూసి తప్పించుకోవడానికి ప్రయత్నించారు. అనుమానం వచ్చిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించగా, వారు అంబటి జ్యోతి (46) మరియు నాగేళ్ల దుర్గ (35)గా గుర్తించారు. వీరు గోకవరం గ్రామానికి చెందినవారు. నిందితుల వద్ద నుండి పోలీసులు



స్వాధీనం చేసుకున్న వస్తువులలో 5 పేటల చంద్రహారం, బంగారు హారం, నెక్లెస్, బ్రాస్లెట్, చెవి దిద్దులు, లాకెట్‌తో కూడిన గొలుసు, జడ గంటలు, ఉంగరం వంటి 160 గ్రాముల బంగారు ఆభరణాలు, అలాగే వెండి మొలతాడు, రెండు జతల వెండి పట్టీలు ఉన్నాయి. అరెస్ట్ అయిన నిందితులపై గతంలో కూడా పలు పోలీసు స్టేషన్ల పరిధిలో చోరీ కేసులు ఉన్నట్లు విచారణలో తేలింది. వీరు బస్సులు, ఆటోలలో ప్రయాణించే మహిళలను మాటలతో మభ్యపెట్టి, బ్యాగుల్లోని విలువైన వస్తువులను కొట్టేయడంలో సిద్ధహస్తులని పోలీసులు తెలిపారు. ఈ కేసును చాకచక్యంగా ఛేదించి, దొంగతనానికి గురైన ఆస్తిని రికవరీ చేసిన రాజానగరం పోలీసు సిబ్బందిని జిల్లా ఉన్నతాధికారులు అభినందించారు. ప్రయాణ సమయంలో మహిళలు తమ విలువైన వస్తువుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.



# యోగా మన జీవన విధానం కావాలి

## మఠం శాంత కుమారి

**అరకువేలి (జయ జయహే)**

యోగ మన జీవన విధానం కావాలని అప్పుడే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని భారతీయ జనతా పార్టీ అల్లూరి సీతారామరాజు జిల్లా అధ్యక్షులు మఠం శాంత కుమారి పేర్కొన్నారు. అరకు వేలి మండలం మాడగడ సన్ రైస్ వ్యూ పాయింట్ వద్ద ఆదివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 108 సూర్య నమస్కారాలతో ఉన్న యోగాసనాలు పూర్తయిన అనంతరం ఆమె మాట్లాడారు. యోగాతో ఆరోగ్యం, ఆనందం ఉంటాయని ఇది నిజ జీవితంలో ఒక భాగం కావాలని సూచించారు. యోగ పురాతనమైందని మతం పుట్టకముందే యోగా పుట్టిందని దీనిని మనం విస్మరించడం వలన మన జీవితంలోకి కొత్తగా వచ్చిందనే భావన కలుగుతుందన్నారు. మన పూర్వీకులు యోగాను అత్యంత పవిత్రంగా భావించి అమలు చేసే వారిని బిజీ జీవితం వల్ల మనం దాన్ని విస్తరించమన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ నిశాంతి , జాయింట్ కలెక్టర్ తిరుమల శ్రీ పూజ , ఐటీడీఏ పీవో ఆదిత్య వర్మ , ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం ప్రాంతీయ జోన్ చైర్మన్ డా. సియ్యారి దొన్ను దొర , టిడిపి పాడేరు నియోజకవర్గ ఇన్చార్జి గిడ్డి ఈశ్వరి అత్యధిక సంఖ్యలో ప్రజలు అధికారులు విద్యార్థులు పాల్గొన్నారు.



# మానవ ఆరోగ్య పరిరక్షణకు యోగ మంచి మార్గం

## శ్రీ ఎండల మల్లికార్జున స్వామి సన్నిధిలో యోగా దినోత్సవం

**టెక్కలి జూన్ 21 జయ జయహే**

మానవ జీవన విధానంలో మానసిక ఆరోగ్య పరిరక్షణ సంపూర్ణ ఆరోగ్యానికి యోగ ఎంతో మేలు చేస్తుందని అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రావి వలస లోని సుప్రసిద్ధ దైవ క్షేత్రమైన శ్రీ ఎండల మల్లికార్జున స్వామి సన్నిధిలో యోగా దినోత్సవం యోగాసనాలు చాలా ఆనందం ఆరోగ్యం దైవకంగా ఉందని టెక్కలి మండలం బిజెపి అధ్యక్షులు , కోటబొమ్మాలి మార్కెట్ కమిటీ డైరెక్టర్ జర్జాన రాంజీ తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు, యోగ ప్రాముఖ్యతను, మానవ శరీరానికి మేధస్సుకు, సంపూర్ణ ఆరోగ్యానికి యోగ ఎంత అవసరమో పాల్గొన్న ప్రతినిధులు స్పష్టం చేశారు, పలు యోగాసనాలను స్వామి సన్నిధిలో నిర్వహించారు, ఈ కార్యక్రమంలో యోగా గురువు సురేష్, జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి జన పాల జనార్ధన రెడ్డి, బిజెపి జనరల్ సెక్రెటరీ నే తింటి రాజారావు, బిజెపి ఉపాధ్యక్షులు ఆకుల ప్రకాష్, అర్చకులు యుగంధర్, మెట్ట నరేష్, పాల్గొని యోగ శిబిరం నిర్వహించారు.



# తూ.గో. జిల్లా బీజేపీ మహిళా మోర్చా జిల్లా కమిటీ ఎంపిక

**రాజమహేంద్రవరం, జయజయహే బ్యూరో:**

తూర్పుగోదావరి జిల్లా భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా నూతన జిల్లా కమిటీని జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు పాలడుగుల శ్రీవిద్య ఆధ్వర్యంలో ఆదివారం అధికారికంగా ప్రకటించారు. ఈ కార్యక్రమం ప్రముఖుల సమక్షంలో ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురంధేశ్వరి, రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు నిశిత రాజు, జిల్లా బీజేపీ అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర పాల్గొని నూతన కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు. నూతన కమిటీ జిల్లా వ్యాప్తంగా మహిళా శక్తిని మరింత బలోపేతం చేయడంతో పాటు పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేయాలని నాయకులు సూచించారు. మహిళలు రాజకీయ, సామాజిక రంగాల్లో మరింత చురుకైన పాత్ర పోషించేలా మహిళా మోర్చా కార్యకలాపాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పార్లమెంట్ సభ్యురాలు పురందేశ్వరి మాట్లాడుతూ, మహిళల సాధికారతకు కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. ఆ కార్యక్రమాల ప్రయోజనాలను ప్రతి కుటుంబానికి చేరవేయడంలో మహిళా మోర్చా కీలక పాత్ర పోషించాలని అన్నారు. రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు నిషీధ రాజు మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి మహిళా కార్యకర్తల సేవలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర మాట్లాడుతూ, పార్టీ విస్తరణలో మహిళా మోర్చా కీలక భూమిక పోషిస్తోందని, కొత్త కమిటీ జిల్లా వ్యాప్తంగా పార్టీ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తుందనే నమ్మకం వ్యక్తం చేశారు. జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు పాలడుగుల శ్రీవిద్య మాట్లాడుతూ, నూతన కమిటీ సభ్యులందరూ సమన్వయంతో పనిచేస్తూ మహిళల సమస్యల పరిష్కారం, పార్టీ అభివృద్ధి లక్ష్యాల సాధన కోసం కృషి చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, మహిళా మోర్చా కార్యకర్తలు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

**మాడుగుల జూన్ 21 జయ జయహే**



మాడుగుల మండలం ఘాటి రోడ్డు జంక్షన్లో ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ బసంత్ కుమార్ మృతి చెందినట్లు స్థానిక ఎస్సై నారాయణరావు ఆదివారం రాత్రి తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటల ప్రాంతంలో దొర్ల సురవరం గ్రామానికి చెందిన బసంత కుమార స్వామి (42) అను వ్యక్తి ఘాట్ రోడ్డు వద్ద నిలబడి ఉండగా వడ్డాది నుండి పాడేరు వైపు వెళ్ళు బెంజ్ లారీని సదరు లారీ డ్రైవర్ స్పీడ్ గా హార్న్ కొట్టకుండా నిర్లక్ష్యంగా నడిపి కుమార స్వామి ని గుద్ది అతని పైనుండి చక్రాలు వెళ్ళిపోవడం వల్ల బలమైన గాయాలు అయ్యి అనకాపల్లి ఎన్ టి ఆర్ ఆసుపత్రి లో చికిత్స పొందుతూ మరణించాడన్నారు. మృతుని తమ్ముడు అయిన బసంత ఘాటి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగిందనీ తెలిపారు.




# విశాఖ సహకార బ్యాంకు డివిడెండ్ 10 శాతం

## నికర లాభం రూ. 66. 15 కోట్లు

### విశాఖపట్నం కోపరేటివ్ బ్యాంకు చైర్మన్ జేవీ సత్యనారాయణ మూర్తి

**విశాఖపట్నం, జూన్ 21, జయ జయహే**

విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్ ఈ ఏడాది డివిడెండ్ ను 10 శాతంగా పాలకవర్గం నిర్ణయించినట్లు వీసీబీ చైర్మన్ జేవీ సత్యనారాయణమూర్తి ప్రకటించారు. లాభాలలో డివిడెంట్ మొత్తంగా రూ 39. 24 కోట్లుగా ఉందని, మిగతా లాభాలను చట్టపరంగా నిర్దేశించిన నిష్పత్తులలో ఆయా ఖాతాలకు జమ చేస్తామని జే.వీ.సత్యనారాయణమూర్తి తెలిపారు. వీసీబీ మహాజన సభ ఆదివారం సిరిపురం వియంఆర్డిఏ వుడా చిల్డ్రన్స్ ఎరినాలో జరిగింది . బ్యాంకు అధ్యక్షులు జామిశెట్టి వెంకట సత్యనారాయణ మూర్తి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సభ ఎజెండా అయిన 2025-26 ఆర్థిక సంవత్సరం పరిపాలనా నివేదిక, 2025-26 ఆడిట్ రిపోర్ట్ లను ప్రవేశ పెట్టడం, ఆమోదించడం, గత ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు ఆర్జించిన లాభాల పంపిణీ, సవరించిన, అంచనా బడ్జెట్ లను ఆమోదించడం, 2026-27 సంవత్సరానికి స్టాట్యూటరి ఆడిటర్ నియామకం వంటి వాటిని వివరించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు డిపాజిట్లలో రూ. 240.24 కోట్ల పెరుగుదలతో రూ. 4594.97 కోట్లకు చేరుకుని 5.52 శాతం వృద్ధి సాధించిందని, రుణాలలో రూ. 440.95 కోట్ల పెరుగుదలతో రూ. 3877.42 కోట్లకు చేరుకుని 12.83 శాతం వృద్ధి నమోదు చేసిందని, బ్యాంకు వ్యాపారం రూ. 681.19 కోట్ల పెరుగుదలతో రూ. 8472.39 కోట్లకు చేరుకుని 8.74 శాతం వృద్ధి నమోదు చేసిందని తెలియజేశారు. ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్ (వీసీబీఎల్) ఈ ఏడాది మార్చి 31 నాటికి రూ. 66.15 కోట్లు నికర లాభం ఆర్జించిందని, 60 బ్రాంచిలు గల తమ బ్యాంకు పరిధిలో 1,17,884 మంది సభ్యులున్నట్లు జె. వి. సత్యనారాయణ మూర్తి వివరించారు. వీసీబీలో షేరు ధనం రూ. 416.25 కోట్లుకు చేరుకుందన్నారు. రిజర్వు బ్యాంకు తాజా నిబంధనల ప్రకారం ఈ ఏడాది 8 కొత్త బ్రాంచిలను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. బ్యాంకు పూర్వ అధ్యక్షులు మానం ఆంజనేయులు మాట్లాడుతూ సంప్రదింపుల కమిటీ సభ్యులు తమ బాధ్యతలను గుర్తించి బ్యాంకు పురోభివృద్ధికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. సభలో డైరెక్టర్ వి. చంద్రశేఖర్ , డైరెక్టర్ డా. సి. కృష్ణ మోహన్ , ఉప్పలపాటి పార్వతిదేవి, చలసాని రాఘవేంద్ర రావు 97వ రాజ్యాంగ సవరణలను ఖండిస్తూ ప్రతిపాదించిన తీర్మానాలకు సభ ఆమోదం తెలిపింది. 60 బ్రాంచిల ప్రతినిధులు, బ్యాంకు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# ఆరోగ్య ఏపీ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యం

- దిన చర్యలో యోగాను భాగం చేసుకోవాలి
- యోగా వేడుకల్లో రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత
- భాగస్వామ్యమైన గణబాబు, ఎమ్మెల్యే పల్లా, జిల్లా అధికారులు

**విశాఖపట్నం, జూన్ 21, జయ జయహే**

ఆరోగ్యకర ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, అందుకోసం ప్రతి ఒక్కరూ యోగాను తమ దినచర్యలో భాగం చేసుకోవాలని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత పిలుపునిచ్చారు. 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆదివారం విశాఖపట్నం బీచ్ రోడ్డులోని సాగరిక ఫంక్షన్ హాలులో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ గణబాబు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, ఆంధ్ర యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ జి.పి. రాజశేఖర్, డీఎఫ్‌వో రవీందర్ ధామా, డీసీపీలు మేరీ ప్రశాంతి, మణికంఠ, వెంకటరత్నం తదితర అధికారులు పాల్గొన్నారు. అలాగే యోగా అసోసియేషన్ ప్రతినిధులు, వివిధ సంస్థల ప్రతినిధులు, యువత, విద్యార్థులు, సాధారణ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై సామూహిక యోగాసనాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హోం మంత్రి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్న సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా 15 రోజుల పాటు "యోగ పక్షోత్సవాలు" నిర్వహించనున్నట్టు తెలిపారు. మానసిక, శారీరక ఆరోగ్యానికి యోగా అవసరమన్నారు. ఒత్తిడితో కూడిన జీవనశైలిలో యోగా, ధ్యానం అత్యంత అవసరమని పేర్కొన్నారు. చిన్నారుల్లో పెరుగుతున్న డిప్రెషన్, మానసిక ఒత్తిడిని తగ్గించడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా ఉత్తమ సాధనమని, ప్రతి ఒక్కరూ దానిని తమ జీవనశైలిలో భాగం చేసుకోవాలని సూచించారు. గత ఏడాది విశాఖపట్నంలో మూడు లక్షల మందికి పైగా పాల్గొని ప్రపంచ రికార్డు సృష్టించిన విషయాన్ని గుర్తు చేస్తూ, ఆ ఘనత సాధించడంలో భాగస్వాములైన విశాఖ ప్రజలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# నేడు డయల్ యువర్ ఏపీఈపీడీసీఎల్ సీఎండీ'

**విశాఖపట్నం, జూన్ 21, జయ జయహే**




ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని విద్యుత్ సంబంధిత సమస్యలను వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రతి సోమవారం 'డయల్ యువర్ ఏపీఈపీడీసీఎల్ సీఎండీ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సంస్థ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ కార్యక్రమం విశాఖపట్నంలోని ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు నిర్వహించబడుతుంది. సంస్థ పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, తూర్పు గోదావరి, కాకినాడ, డా.బి.ఆర్. అంబేడ్కర్ కోనసీమ, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు 8688400499 ఫోన్ నంబర్ ద్వారా తమ సమస్యలను తెలియజేయవచ్చు. ఈ కార్యక్రమంలో విద్యుత్ సరఫరా అంతరాయాలు, వోల్టేజ్ హెచ్చుతగ్గులు, కొత్త కనెక్షన్ల జారీలో జాప్యం, సరఫరా పునరుద్ధరణలో ఆలస్యం, ట్రాన్స్‌ఫార్మర్ మార్పిడి, రూఫ్‌టాప్ సోలార్ వంటి వివిధ సమస్యలపై ఫిర్యాదులను నేరుగా సీఎండీ దృష్టికి తీసుకురావచ్చు. ఈ అవకాశాన్ని సంస్థ పరిధిలోని 11 జిల్లాల విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఈపీడీసీఎల్ ఆదివారం ఒక ప్రకటనలో కోరింది.

# దిష్టి బొమ్మ కాదు... కీర్తిముఖుడు!

(పుట్టా శ్రీనివాసరావు)




మీ సింహ ద్వారం ముందు కాపాల గా ఉంచే ఇంటిల్లి పాదికి కీర్తి ప్రతిష్టలు, సుఖ క్షేమాలు, ఆయు, ఆరోగ్యం ప్రసాదించే శక్తి స్వరూపము...

రాహువు కీర్తిముఖుని ఆధ్యాత్మిక అంతరార్థం..........!!

**రాహువు వృత్తాంతం:**

రాహువు ఒక ఛాయా గ్రహం. అమృత భాండం పంపిణీ సమయంలో శ్రీమహావిష్ణువు తన తలను ఖండించినందుకు ప్రతికారంగా, అతను నిరంతరం సూర్యచంద్రులను వెంటాడుతుంటాడు. ఈ పురాణ గాథే సూర్య, చంద్ర గ్రహణాలకు కారణమైంది.

**కీర్తిముఖుని వృత్తాంతం:**

మరోవైపు, కీర్తిముఖుడు అంటే పరమశివుని దివ్యాగ్రహం నుండి ఉద్భవించిన ఒక భయంకరమైన రక్షక ముఖం. ఆ జీవి ఆకలి ఎంత తీవ్రమైనదంటే, అది తన స్వంత శరీరాన్నే తినేసింది, చివరికి కేవలం ముఖం మాత్రమే మిగిలింది.

**ప్రతీకాత్మక ఆధ్యాత్మిక సత్యం**

రాహువు సూర్యచంద్రులను మింగాలని ప్రయత్నిస్తుంటే, కీర్తిముఖుడు ఆ రాహువునే మింగడానికి ప్రయత్నించడం వెనుక ఒక లోతైన ఆధ్యాత్మిక సత్యం దాగి ఉంది.

విశ్వంలో ఎంతటి అజేయమైన శక్తులుగా కనిపించే వాటికంటే కూడా, వాటిని మించిన ఒక ఉన్నతమైన దైవిక విశ్వ శక్తి ఎల్లప్పుడూ ఉంటుంది.

రాహువు దేనికి ప్రతీక? రాహువు తీరని కోరికలు, వ్యామోహం, భ్రమ ప్రాపంచిక తృష్ణలకు ప్రతీక. ఇవి సూర్యచంద్రుల రూపంలో ఉండే ఆత్మజ్ఞానపు వెలుగును కప్పివేయడానికి ప్రయత్నిస్తాయి.

కీర్తిముఖుడు దేనికి ప్రతీక? కీర్తిముఖుడు దైవిక జ్ఞానమనే అగ్నికి ప్రతీక. ఇది చివరికి అహంకారాన్ని, గర్వాన్ని అదుపులేని కోరికలను దహించివేస్తుంది

ఈ శక్తివంతమైన దృశ్యం మనకు నేర్పే పాఠం ఏమిటంటే భ్రమ లేదా మాయ అనేది తాత్కాలికంగా సత్యాన్ని కప్పివేసినప్పటికీ, దైవిక చైతన్యం, ఆధ్యాత్మిక మేల్కొలుపు అనే ఉన్నత శక్తి అన్ని శక్తుల కంటే పైన నిలుస్తుంది. ఇది విశ్వంలో సమతుల్యతను పునరుద్ధరించి, సనాతన ధర్మాన్ని కాపాడుతుంది.

### భారత్ ఇంధన భద్రతకు భారీ ఊరట..

# హర్మ్మాజ్ దాటిన 3 ఆయిల్ ట్యాంకర్లు

**8.6 లక్షల మెట్రిక్ టన్నుల ముడిచమురుతో భారత్‌కు ప్రయాణం**

**కేంద్ర మంత్రి సోనోవాల్ ప్రకటన.. ప్రభుత్వ సమన్వయంతోనే సాధ్యమైందని వెల్లడి**

**అమెరికా-ఇరాన్ ఒప్పందం తర్వాత సడలిన ఆంక్షలతో తిరిగి ప్రారంభమైన నౌకల రాకపోకలు**

**దేశ ఇంధన భద్రతకు ఈ పరిణామం అత్యంత కీలకమని విశ్లేషణ**

భారత సముద్ర వాణిజ్యానికి, ఇంధన భద్రతకు పెద్ద ఊరట లభించింది. వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైన హర్మ్మాజ్ జలసంధిని మూడు భారతీయ జెండా కలిగిన భారీ క్రూడ్ ఆయిల్ ట్యాంకర్లు విజయవంతంగా దాటాయి. 8.6 లక్షల మెట్రిక్ టన్నుల ముడిచమురుతో ఈ నౌకలు ప్రస్తుతం భారత ఓడరేవుల వైపు ప్రయాణిస్తున్నాయి. పశ్చిమాసియాలో నెలకొన్న రాజకీయ, భౌగోళిక ఉద్రిక్తతల కారణంగా కొన్నాళ్లుగా నిలిచిపోయిన ఈ జలమార్గంలో రవాణా తిరిగి ప్రారంభం కావడం భారత్‌కు శు భపరిణామం.

ఈ విషయాన్ని కేంద్ర పోర్టులు, షిప్పింగ్, జలమార్గాల శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ 'ఎక్స్' (ట్విట్టర్) ద్వారా ప్రకటించారు. 'దేశ్ వైభవ్', 'దేశ్ విభోర్', 'సన్మార్ హెరాల్డ్' అనే మూడు నౌకలు 94 మంది భారత సిబ్బందితో హర్మ్మాజ్ జలసంధిని సురక్షితంగా దాటినట్లు ఆయన తెలిపారు. "ప్రధాని నరేంద్ర మోదీ గారి నిర్ణయాత్మక నాయకత్వంలో భారత ప్రభుత్వం దేశ సముద్ర ప్రయోజనాల పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది. మన నావికుల భద్రత, దేశ ఇంధన సరఫరా మార్గాల పరిరక్షణ కోసం మా మంత్రిత్వ శాఖ అన్ని సంబంధిత ఏజెన్సీలతో సమన్వయం చేసుకుంటూ పనిచేస్తోంది" అని సోనోవాల్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

అధికారిక వర్గాల సమాచారం ప్రకారం ఈ మూడు నౌకలు జూన్ 24 నుంచి జులై 1 మధ్య భారత తీరానికి చేరుకోనున్నాయి. 'దేశ్ వైభవ్' జూన్ 24న గుజరాత్‌లోని వాడినార్ పోర్టుకు, 'దేశ్ విభోర్' అదే రోజున సిక్కా పోర్టుకు చేరుకునే అవకాశం ఉంది. ఇక జూన్ 20న హర్మ్మాజ్ జలసంధిని దాటిన 'సన్మార్ హెరాల్డ్' నౌక జులై 1న ఒడిశాలోని పారాదీప్ పోర్టుకు చేరుకోనుంది.

ఈ పరిణామం వెనుక అంతర్జాతీయంగా చోటుచేసుకున్న కీలక దౌత్యపరమైన పరిణామాలు ఉన్నాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను తగ్గించే లక్ష్యంతో అమెరికా, ఇరాన్ మధ్య ఇటీవల ఒక ఒప్పందం కుదిరింది. జూన్



18న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ ఒప్పందంపై సంతకం చేశారు. దీని ప్రకారం ఇరాన్ తన వద్ద ఉన్న అత్యధిక శుద్ధి చేసిన యురేనియం నిల్వలను తగ్గించుకోవాలి, ప్రతిగా అమెరికా కొన్ని ఆంక్షలను సడలిస్తుంది. ఈ ఒప్పందం తర్వాత, అదే రోజున హార్ముజ్ జలసంధి గుండా నౌకల రాకపోకలపై ఉన్న ఆంక్షలను అమెరికా ఎత్తివేసింది. దీంతో నెలల తరబడి స్తంభించిన ఈ మార్గంలో చమురు ట్యాంకర్ల సంచారం తిరిగి ప్రారంభమైంది.

దేశీయ ఇంధన అవసరాల కోసం అధికంగా ముడి చమురు దిగుమతులపైనే ఆధారపడి ఉన్న భారత్‌కు, సముద్ర మార్గాల్లో రవాణా నిరంతరాయంగా సాగడం అత్యంత ముఖ్యం. ఈ నౌకలు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరడం అనేది ఒకవైపు అంతర్జాతీయ దౌత్య విజయాన్ని, మరోవైపు భారత ప్రభుత్వం తన ఇంధన భద్రతకు, సముద్ర ప్రయోజనాలకు ఇస్తున్న ప్రాధాన్యతను సూచిస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు. సున్నితమైన అంతర్జాతీయ జలాల్లో ప్రయాణించే నౌకలు, సిబ్బంది భద్రత కోసం వివిధ ఏజెన్సీల మధ్య సమన్వయం నిరంతరం కొనసాగుతోందని అధికారులు తెలిపారు.

# మసకబారిన తెలుగు పద్యం వైభవం

(సి.హెచ్.ప్రతాప్)

తెలుగు సాహిత్య సంపదలో పద్యానికి అపూర్వమైన స్థానం ఉంది. "దేశభాషలందు తెలుగు లెస్స" అని మహాకవి శ్రీకృష్ణదేవరాయలు పేర్కొన్న గొప్పతనానికి ప్రధాన కారణాలలో తెలుగు పద్య సంప్రదాయం ఒకటి. ఒకప్పుడు గ్రామ వీధుల నుండి రాజసభల వరకు, పాఠశాలల నుండి పండిత గోష్టుల వరకు పద్యాల ధ్వనులు మారుమోగేవి. నన్నయ, తిక్కన, ఎర్రప్రగడల వంటి ఆదికవుల నుండి పోతన, శ్రీనాథ, వేమన, తెనాలి రామకృష్ణ, త్యాగరాజుల వరకు అనేక మంది మహానుభావులు తెలుగు పద్య సాహిత్యాన్ని అద్భుత శిఖరాలకు చేర్చారు.

పద్యానికి కేవలం ఛందస్సు, యతి, ప్రాసల సౌందర్యమే కాదు; భావ గాంభీర్యం, నీతి బోధ, భక్తి, దేశభక్తి, జీవన తత్వం వంటి విలువలను ప్రజలలో నాటే శక్తి ఉంది. ఒక చిన్న పద్యం మనసును కదిలించగలదు, జీవితాన్ని మార్చగలదు. అందుకే పూర్వ కాలంలో పిల్లలకు మొదట నేర్పేది సుమతీ శతకం, వేమన పద్యాలు, భగవద్గీత శ్లోకాలు. పద్యం జ్ఞాపకశక్తిని పెంచేది, భాషపై పట్టు తెచ్చేది, ఉచ్చారణను మెరుగుపరచేది. పద్యంలోని లయబద్ధత మనిషి ఆలోచనా విధానాన్ని క్రమబద్ధం చేస్తుంది.

అయితే కాలగమనంలో తెలుగు పద్యం వైభవం మసకబారింది. ఆధునిక విద్యా విధానంలో తెలుగు సాహిత్యానికి తగ్గ ప్రాధాన్యం లేకపోవడం, ఆంగ్ల భాష ఆధిపత్యం పెరగడం, సాంకేతిక ప్రపంచ ప్రభావంతో యువత పుస్తక పఠనానికి దూరమవడం వంటి కారణాల వల్ల పద్య సాహిత్యం క్రమంగా మరుగున పడుతోంది. చాలామంది విద్యార్థులు ఛందస్సు అంటేనే కఠినమని భావిస్తున్నారు. పాఠశాలల్లో పద్య పఠనం కేవలం పరీక్షల పరిమితిలోనే మిగిలిపోవడం కూడా ఒక ప్రధాన లోపం. సమాజంలో మాతృభాష పట్ల ఆదరణ తగ్గడం కవితా హృదయాలను దెబ్బతీస్తోంది.

తెలుగు పద్య వైభవాన్ని తిరిగి వెలుగులోకి తేవాలంటే సమాజం మొత్తం కృషి చేయాలి. పాఠశాల స్థాయిలోనే పద్య పఠన పోటీలు, అవధాన కార్యక్రమాలు, వాచక శిక్షణలు నిర్వహించాలి. పిల్లలకు పద్యాల భావార్థాన్ని కథల రూపంలో చెప్పాలి. సంగీతంతో పద్యాలను అనుసంధానం చేస్తే యువత మరింత ఆకర్షితులవుతారు. డిజిటల్ మాధ్యమాలలో పద్యాలకు ప్రత్యేక వేదికలు ఏర్పడాలి. యూట్యూబ్, ధ్వని మాధ్యమాలు, నాటక రూపకాలు ద్వారా పద్యాలను ప్రజలకు చేరువ చేయాలి. ఆధునిక దృశ్య శ్రవణ పద్ధతులు పద్యాన్ని ఆకర్షణీయంగా మార్చగలవు.

ప్రభుత్వాలు కూడా తెలుగు సాహిత్యాభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. పురాతన గ్రంథాలను డిజిటలైజ్ చేసి అందుబాటులోకి తేవాలి. గ్రామస్థాయిలో సాహిత్య వేదికలు ఏర్పాటు చేసి కవిసమ్మేళనాలు నిర్వహించాలి. విశ్వవిద్యాలయాలలో ఛందస్సు, అలంకార శాస్త్రాలపై ప్రత్యేక పరిశోధన కేంద్రాలు స్థాపించాలి. యువ కవులను ప్రోత్సహించే పురస్కారాలు ఇవ్వాలి. తెలుగు పద్యం కేవలం గత వైభవం కాదు; అది మన సంస్కృతి యొక్క ఆత్మ. పద్యంలో భాష యొక్క మాధుర్యం, సంస్కృతి యొక్క పరిమళం, జాతి యొక్క ఆత్మగౌరవం దాగి ఉన్నాయి.

పద్య సంపదను కాపాడుకోవడం అంటే మన మూలాలను రక్షించుకోవడం. ప్రతి కుటుంబంలో రోజుకు ఒక పద్యం చదివే అలవాటు పెరిగితే, ప్రతి పాఠశాలలో పద్య గానం వినిపిస్తే, ప్రతి యువకుడు ఒక తెలుగు కవి గురించి తెలుసుకుంటే తెలుగు పద్యం తిరిగి తన పూర్వ వైభవాన్ని సంతరించుకుంటుంది. తెలుగు తల్లి కిరీటంలో పద్యం మళ్లీ ప్రకాశించే మాణిక్యంగా వెలుగొందే రోజు దూరంలో లేదు.



## యోగా నాకు చాలా ఇచ్చింది

**డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్**

**యోగాతోనే తనకు లోతైన స్పష్టత, పరిపక్వత లభించాయని చెప్పిన పవన్ కల్యాణ్**

**తన దినచర్యలో క్రియ యోగ, అష్టాంగ యోగ అంతర్భాగమని వెల్లడి**

**యోగాకు ప్రపంచ గుర్తింపు తెచ్చిన ప్రధాని మోదీకి కృతజ్ఞతలు**

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ యోగాతో తనకున్న అనుబంధాన్ని పంచుకున్నారు. యోగా తనకు లోతైన స్పష్టతను, అంతర్గత పరిపక్వతను అందించిందని, తన ప్రయాణాన్ని అది ఎంతగానో ప్రభావితం చేసిందని ఆదివారం ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో తన అభిప్రాయాలను పంచుకున్నారు.

"భారత నాగరికతలో యోగా ఒక అంతర్భాగం. ప్రపంచానికి భారత్ అందించిన అద్భుతమైన బహుమతి ఇది. శారీరక ఆరోగ్యం, మానసిక స్పష్టత, అంతర్గత సమతుల్యతను యోగా ప్రోత్సహిస్తుంది. ప్రతి ఒక్కరూ యోగాను తమ జీవనశైలిలో భాగం చేసుకోవాలి" అని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు.

చిన్న వయసులోనే తాను యోగా ప్రయాణం ప్రారంభించానని ఆయన గుర్తుచేసుకున్నారు. "నా మదిలో ఎన్నో ప్రశ్నలతో సతమతమవుతున్న సమయంలో, యోగా నాకు సమాధానాలు ఇవ్వడమే కాకుండా, ప్రగాఢమైన స్పష్టతను, పరిపక్వతను ఇచ్చింది. నా ప్రయాణానికి సరైన మార్గాన్ని చూపింది. క్రియ యోగ, అష్టాంగ యోగ, ఆర్ట్ ఆఫ్ లివింగ్‌కు చెందిన సుదర్శన క్రియ వంటివి ఇప్పటికీ నా దినచర్యలో అంతర్భాగంగా కొనసాగుతున్నాయి" అని ఆయన వివరించారు.

యోగాకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తీసుకురావడంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన కృషిని పవన్ కల్యాణ్ ప్రశంసించారు. జూన్ 21ని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా జరుపుకోవాలన్న మోదీ చొరవకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

**విశాఖలో ఘనంగా యోగా వేడుకలు**

మరోవైపు, రాష్ట్రవ్యాప్తంగా 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. విశాఖపట్నంలోని సాగరిక ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర హోం మంత్రి వి. అనిత పాల్గొన్నారు. ప్రభుత్వ విప్ గణబాబు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుతో కలిసి ఆమె యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిషోర్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, ఆంధ్ర యూనివర్సిటీ వైస్-ఛాన్సలర్ జి.పి. రాజశేఖర్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. యోగా అసోసియేషన్ ప్రతినిధులు, ఇతర సంఘాల సభ్యులు, సాధారణ పౌరులు, యువత ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.



## లిస్ట్-ఎ క్రికెట్‌లో నయా వరల్డ్ రికార్డ్.. 11 బంతుల్లోనే వైభవ్ సూర్యవంశీ అర్ధసెంచరీ!

భారత యువ క్రికెట్ సంచలనం, 15 ఏళ్ల ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ అంతర్జాతీయ క్రికెట్ ప్రపంచం అబ్బురపడేలా సరికొత్త ప్రపంచ రికార్డును నెలకొల్పాడు. శ్రీలంకలోని రంగిరి దంబుల్లా అంతర్జాతీయ స్టేడియం వేదికగా శ్రీలంక 'ఎ' జట్టుతో జరుగుతున్న ముక్కోణపు సిరీస్ ఫైనల్ మ్యాచ్‌లో వైభవ్ లంక బౌలింగ్‌ను తుత్తినియలు చేశాడు. కేవలం 11 బంతుల్లోనే అర్ధ సెంచరీ మార్కును దాటి, లిస్ట్-ఎ క్రికెట్ చరిత్రలోనే అత్యంత వేగవంతమైన అర్ధశతకాన్ని నమోదు చేసిన బ్యాటర్‌గా చరిత్రకెక్కాడు. టాస్ గెలిచి మొదట బౌలింగ్ ఎంచుకున్న శ్రీలంక జట్టు నిర్ణయాన్ని తలకిందులు చేస్తూ.. వైభవ్ తన అటాకింగ్ బ్యాటింగ్‌తో స్టేడియం నలుమూలలా బౌండరీల వర్షం కురిపించాడు. 29 బంతుల్లో 10 ఫోర్లు, 8 సిక్సర్లతో 94 పరుగులు చేసిన సూర్యవంశీ శ్రీలంక కెప్టెన్ సహాన్ అరాచ్చిగే బౌలింగ్‌లో వియాస్కాంత్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. మరో ఓపెనర్ ప్రియాంశ్ ఆర్య (24 బంతుల్లో 37)తో కలిసి ఇన్నింగ్స్ ప్రారంభించిన సూర్యవంశీ కేవలం 6.3 ఓవర్లలోనే వికెట్ నష్టపోకుండా 104 పరుగుల భారీ స్కోరును బోర్డుపై ఉంచాడు. ఐపీఎల్‌లో ఇప్పటికే సత్తా చాటిన ఈ బీహార్ కుర్రాడి దూకుడు ముందు కుగదాస్ మథులన్ వంటి లంక ప్రధాన బౌలర్లు సైతం చేతులెత్తేశారు. కెప్టెన్ తిలక్ వర్మ, సీనియర్ ఆటగాడు రుతురాజ్ గైక్వాడ్‌లతో కూడిన భారత్ 'ఎ' జట్టు ఈ మ్యాచ్‌లో ఆరంభం నుంచే పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూ టైటిల్ దిశగా దూసుకుపోతోంది. ఈ మ్యాచ్ కేవలం ఫైనల్ మాత్రమే కాకుండా ఇరు జట్ల మధ్య ఉన్న పాత పగలకు వేదికగా మారింది. జూన్ 15న జరిగిన లీగ్ మ్యాచ్‌లో శ్రీలంక 'ఎ' జట్టు వివాదాస్పద రీతిలో సూపర్ ఓవర్ గెలిచిన అనంతరం వైభవ్‌ను రెచ్చగొట్టడం, ఆపై మైదానంలో ఇరు జట్ల ఆటగాళ్ల మధ్య పెద్ద ఘర్షణ జరగడం తెలిసిందే. ఆ ఘటనలో వైభవ్‌కు జరిమానా పడినప్పటికీ.. నేడు దానికి తన పవర్‌ఫుల్ బ్యాటింగ్‌తోనే లంకకు సమాధానం ఇచ్చి ప్రతీకారం తీర్చుకున్నాడు. లీగ్ దశలో అఫ్ఘనిస్థాన్‌పై 101 పరుగుల భారీ విజయం సాధించి ఫేవరెట్‌గా బరిలోకి దిగిన భారత్.. ఈ ఫైనల్లో లంకకు సొంత గడ్డపైనే చుక్కలు చూపిస్తోంది.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com